ఆదివారం
14 జులై, 2024
వార్త
వనాల నుంచి..
జనాల్లోకి!

మహేశ్-రాజమౌళి చిత్రంలో

మలయాళ నటుడు?

మహేశ్, రాజమౌళి కాంబినేషన్‌లో రానున్న సినిమా భారీ బడ్జెట్‌తో ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో అడ్వెంచర్ ఫిల్మ్‌గా రూపొందనుంది. మహేశ్ కెరీర్‌లో ఇది **29**వ ప్రాజెక్ట్. రాజమౌళి సినిమాల్లో విలన్ పాత్రలు చాలా పవర్‌ఫుల్‌గా ఉంటాయని తెలిసిందే. అందువల్ల ఈ చిత్రంలో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్‌ను తీసుకుంటున్నట్లు సమాచారం. పృథ్వీరాజ్‌కి పాన్ ఇండియా గుర్తింపు ఉంది. ఇతడు గతంలో పలు డబ్బింగ్ సినిమాల్లో నటించాడు. 'పోలీస్ పోలీస్' అనే తెలుగు సినిమాలో, ప్రభాస్, ప్రశాంత్‌నీల్ కాంబినేషన్‌లో వచ్చిన 'సలార్' చిత్రాల్లోనూ నటించాడు.

తారాతీరం

'రాబిన్‌హుడ్' డిసెంబరులో విడుదల?

టాలీవుడ్ హీరో నితిన్ ప్రధాన పాత్రలో, వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబరులో వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్‌లు నిర్మిస్తున్న ఈ సినిమాకి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

ఆదివారం వార్త

14 జులై, 2024

మంచి ముత్యాలు

ప్రేమ కావాలని ఆజ్ఞాపించకు. అది అలా దొరకదు. ప్రేమించడం ప్రారంభించు. నీవు ప్రేమించబడతావు.

- రాజాజీ

విషయ విశేషం

సిక్స్ పాకెట్ తంటా... 4

'సంఘీ'భావం....5

అతివృష్టి, అనావృష్టితో అన్నదాత..

కవర్ స్టోరీ..6

వనాల నుంచి..
జనాల్లోకి!

మార్కెట్లో కొత్తగా...10

ఈవారం కవిత్వం..12

ప్లాస్టిక్‌తో ప్రళయం

'మాయ'శ్చరైజర్....14

సువాసనల అత్తరు.....18

కథ.. 20

బావండీ!

సాహిత్యం..23

భరద్వాజుని 'ఐతరేయం'

ప్రసిద్ధ సముద్ర వంతెనలు...26

తులసికోట ఏ దిక్కులో ఉండాలి?..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

తాజా వార్తలు

బరువైన బైక్

మీరిప్పటిదాకా ఎన్నో రకాల సొగసైన, శక్తివంతమైన బైకులను చూసివుంటారు. కానీ ఇలాంటి బాహుబలి బైకును ఇంతకు ముందు ఎక్కడా, ఎన్నడూ చూసుండరు. ఎందుకంటే సోవియట్ యుద్ధట్యాంకర్ ఇంజను అమర్చిన ఈ బైకు బరువు ఏకంగా 5 టన్నులు. అందుకే ప్రపంచంలోనే అతిబరువైన రైడబుల్ మోటర్‌సైకిల్‌గా ఇది గుర్తింపు పొందింది. సాధారణ బైక్‌పై రైడ్‌కి వెళితే మజా ఏముంటుంది? విభిన్నంగా ఉండే బైక్‌పై వెళుతుంటే దారి పొడవునా అందరూ మనల్నే చూడాలి. అప్పుడే కిక్కు అనుకున్నారు జర్మనీకి చెందిన సోదరులు టిలో, విల్‌ఫ్రెడ్ నిబెల్. వారి ఆలోచనల్లో నుంచి పుట్టుకొచ్చిందే ఈ బాహుబలి బైక్. 'పాంజర్ బైక్'గా పిలుస్తున్న ఈ వాహనానికి సోవియట్ టి-55 యుద్ధట్యాంక్ ఇంజనును అమర్చారు. ఈ ఇంజను సామర్థ్యం 35 వేల సి.సి. వెల్డింగ్, వాహనాల రిపేరు షాపు నిర్వహించే ఈ సోదరులు కొన్ని వాహనాల నుంచి తీసిన పాత సామానును తుక్కు కింద అమ్మేయకుండా బైక్ తయారీలో ఉపయోగించారు. దీని తయారీ కోసం ఉపయోగించిన విడిభాగా లలో ఎక్కువ శాతం ఉపయోగించిన సోవియట్ యుద్ధట్యాంకుల నుంచి తీసుకున్నవే ఉన్నాయి. ఈ బైక్ పూర్తి కావడానికి సోదరులిద్దరూ మూడేళ్లపాటు అహోరాత్రులు శ్రమించారు. 120 కిలోల వెల్డింగ్‌వైర్‌ని ఉపయోగించారు. జర్మనీకి చెందిన పాంజర్ ట్యాంక్ స్ఫూర్తితో మోటర్‌సైకిల్‌కు 'పాంజర్ బైక్' అని పేరు పెట్టారు. ఈ బైక్‌ని నడపాలంటే ఒక్కరివల్ల కాదు. ఇద్దరు కచ్చితంగా ఉండాల్సిందే.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

సిక్స్ పాకెట్ తంటా

- డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి

నేడు చైనా ఒక విచిత్రమైన సంక్షోభ అంచున నిలబడిందని, దీని ప్రభావంతో భవిష్యత్తులో చైనా తీవ్రమైన సామాజిక ఆర్థిక సమస్యలను ఎదుర్కోనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 'సిక్స్ పాకెట్ సింద్రోమ్' లేదా 'చిన్న చక్రవర్తి' (లిటిల్ ఎంపెరర్) సమస్యగా గుర్తించబడిన సమస్యతో చైనాలో చిన్నారులు స్థూలకాయ సమస్యలను ఎదుర్కొంటున్నారని తేలింది. చైనా ప్రభుత్వం తీసుకున్న ఒక జంటకు ఒకే సంతానమనే (సింగిల్ చైల్డ్ పాలసీ) నిర్ణయంతో తమ ఏకైక సంతానాన్ని ప్రేమగా పెంచుతూ పిజ్జాలు, బర్గర్లు, ఐస్‌క్రీమ్‌లు, ఫాస్ట్‌ఫుడ్స్, జంక్‌ఫుడ్స్, కొవ్వుతో కూడిన ఆహారం, చక్కెర నిండిన శీతల పానీయాలు, సాసులులాంటి

ఆహార పదార్థాలకు అలవాటు చేయడంతో పిల్లలు స్థూలకాయం పొందుతున్నట్లు గమనించారు. ఏకైక సంతానానికి సంపన్న కుటుంబాల తల్లిదండ్రులు, ఇద్దరు తాతలు (తండ్రి నాన్న, తల్లినాన్న), ఇద్దరు అవ్వలు (నాన్నమ్మ, అమ్మమ్మ) కలిసి ఆరుగురు పిల్లాడిని లాలిస్తూ గారాబం చేయడం, కోరిన ఆహారాన్ని ఇవ్వడంతో పిల్లల్లో అధిక బరువు సమస్యలు ఉత్పన్నం కావడాన్ని 'సిక్స్ పాకెట్ సింద్రోమ్'గా పేర్కొంటున్నారు.

ముద్దు చేసి ముద్ద తినిపిస్తూ

ఈ సిక్స్ పాకెట్ సింద్రోమ్ సమస్య పట్టణపిల్లల్లో అధికంగా గమనించారు. తల్లిదండ్రులు మంచి సంపాదనపరులు కావడంతో ఏకైక సంతాన ఆహారం పట్ల అధికంగా డబ్బులు వెచ్చించడానికి సహితం వెనుకాడటం లేదని తేలింది. 1982లో 7శాతం పట్టణబాలలు అధిక బరువు కలిగి ఉండగా, 1992లో 15శాతం, 2002లో 23శాతం నగర పిల్లలు స్థూలకాయులుగా మారారని శాస్త్ర అధ్యయనంలో తేలింది. 1982లో 7శాతం పట్టణ బాలలు అధికబరువు కలిగి ఉండగా, 1992లో 15శాతం, 2002లో 23శాతం నగర పిల్లలు స్థూలకా యులుగా మారారని శాస్త్ర అధ్యయనంలో తేలింది. నేడు చైనాలో దాదాపు 12కోట్లకు పైగా జనులు

అధికబరువు సమస్యలను అనుభవిస్తున్నారని, అందులో సగంమంది చిన్న స్థూల చక్రవర్తులు ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. చిన్నారుల్లో స్థూలకాయ సమస్యలతో పలు రకాల వ్యాధులు, మధుమేహ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

చైనాలో వచ్చిన ఆర్థికసామాజిక మార్పులతో తల్లిదండ్రులు తమ ఏకైక సంతానాన్ని గారాబం చేసి పెంచడం, ముద్దు చేసి ముద్దలు తినిపించడం, పలు రకాల స్థూలకాయ ప్రేరేపిత ఆహారం అందుబాటులో ఉంచడంతో సిక్స్ పాకెట్ సింద్రోమ్‌కు దారులు తెరిచినట్లు అయ్యింది. చైనాలో 7 నుంచి 22 ఏండ్ల వయస్సుగల పట్టణ బాలల్లో 16శాతం స్థూలకాయం సమస్యలతో భారంగా బతుకుతున్నట్లు తేలింది. ప్రతి ఏట స్థూలకాయులు 8శాతం పెరుగుతున్నా రని, రానున్న రోజుల్లో ఈ సమస్య చైనాకు పెద్ద సంక్షోభ కారణం కావచ్చుని హెచ్చరిస్తూ, 'బిహేవియరల్ టైం-బాంబు'గా కూడా మారవచ్చని అంచనా వేస్తున్నారు.

సెడెంటరీ లైఫ్ స్టైల్

బాల్యదశలో స్థూలకాయ సమస్య ఉత్పన్నం అయితే సమాజంగా ఎదిగిన తరువాత కూడా సమస్య కొనసాగడం గమనించారు. చైనాలో లావునా ఉన్న పిల్లలను చూసి పెద్దలు మురిసిపోతూ ఐశ్వర్యానికి సూచన గా భావించే ఆచారం ఉండడం విశేషం. యుక్తవయస్సులో జీరోసైజ్‌ను ఇష్టపడడంతో అధికబరువు కలిగిన బాలికలు బరువు తగ్గించుకోవడం కష్టం అవుతున్నది.

చైనా పట్టణవాసులు అధిక ఆదాయాలను కలిగి ఉండడం, పశ్చిమ దేశాల ఆహార పదార్థాలు సులభంగా లభించడం, నిశ్చలమైన జీవన శైలి (సెడెంటరీ లైఫ్‌స్టైల్), కార్లలో తిరగడం, ఆల్కహాల్ పానీయాల సేవనం, భౌతిక శారీరక వ్యాయామం లోపించడం లాంటి పలు కారణాలతో సిక్స్ పాకెట్ సింద్రోమ్ బారిన పడ డం సాధారణం అవుతున్నది. నేడు చైనా ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు, నలుగురు తాతలు/ తాతమ్మలు తమ ఇంట్లోని ఏకైక సంతానాన్ని విచక్షణతో సూబీలకాయానికి దూరంగా పెంచాలని కోరుకుందాం. నేడు భారత సంపన్న కుటుంబాల పిల్లలు కూడా సిక్స్ పాకెట్ సింద్రోమ్‌కు దూరంగా, ఆరోగ్యకర వాతావరణంలో పెరగాలని, ఇండియా మరొక సిక్స్ పాకెట్ సింద్రోమ్ కేంద్రంగా మారకూడదని కోరుకుందాం. ■

'సంఘీ' భావం

అతివృష్టి, అనావృష్టితో అన్నదాతలు ఆగమాగం

సకాలంలో వర్షాలు కురియకపోవడంతో వ్యవసాయరంగం సమస్యల వలయంలో చిక్కుకుంది. నైరుతీ రుతుపవనాలు సాధారణం కంటే ముందే ప్రవేశించాయి. దీనితో ఈసారి వర్షాలకు కొరత ఉండదని భావించారు. అయితే అనూహ్యరీతిలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రెండు నెలల క్రితం కురిసిన అకాల వర్షాలు అన్నదాతకు అగ్నిపరీక్షగా మారితే ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు మూడేళ్ల నుంచి నైరుతీ రుతుపవనాలు ఆలస్యంగా వచ్చేవి. వర్షాలు పడే వరకు అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురయ్యేవారు. ఈసారి రెండు వారాలు ముందుగానే తొలకరి పలకరించింది. ఈ సంవత్సరం వ్యవసాయ రంగానికి వర్షాలు ఎంతో అనుకూలంగా ఉంటాయని భావించారు. రైతులు దుక్కిదున్ని పంటలు వేయడానికి సిద్ధపడ్డారు. చాలా ప్రాంతాల్లో విత్తనాలు కూడా నాటారు. అయితే దురదృష్టవశాత్తు తొలకరిలో పలకరించిన వరుణుడు పత్తాలేకుండా పోయాడు. దీనితో వేసవికాలం మరో నెల రోజుల పాటు కొనసాగింది. అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు కురిసినా అవి వ్యవసాయ పనులకు ఏమాత్రం ఉపయోగపడలేదు. ముఖ్యంగా తెలంగాణలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ఇప్పటి వరకు కురిసిన వర్షపాతాన్ని పరిశీలిస్తే చాలా ప్రాంతాల్లో 55 నుంచి 70 శాతం సగటు వర్షపాతం కంటే తక్కువ కురిసింది. ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. సుమారు రెండు దశాబ్దాల క్రితం పరిస్థితిని పరిశీలిస్తే ఒక లెక్క ప్రకారం వర్షాలు సకాలంలో కురిసేవి. అదేవిధంగా వేసవికాలంలో కూడా గరిష్టం ఉష్ణోగ్రతలు కూడా ఒక మోస్తారుగా ఉండేది. కాలుష్యం అధికం కావడం, విషతుల్య వాయువులను కర్మాగారాల నుంచి వదిలిపెట్టడం, కలుషిత నీరు నదుల్లో కలవడం, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం కోసం, రోడ్ల విస్తరణ కోసం ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేయడం, అటవీ ప్రాంతంలో సైతం ఆక్రమణలు జరుగుతూ ఉండటంతో వాతావరణంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఈ ప్రభావం ఎండలు, వర్షాలపై చూపుతోంది. ఈ ఏడాదిలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో 50 డిగ్రీల సెల్సియస్ ఎండతీవ్రత నమోదు అయ్యింది. ఇక ఢిల్లీలో అయితే 55 డిగ్రీలు దాటింది. దీనితో పెద్దసంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మధ్యాహ్నం సమయంలో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వర్షాలపై కూడా ఇదే ప్రభావం చూపుతోంది. వర్షాలు కురియడం లేదు. దీనితో వ్యవసాయ భూములు బీడువారుతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయి. రెండు రాష్ట్రాల్లోని రిజర్వాయర్లలో నీటిమట్టం అడుగంటి పోయింది. కేవలం మంచినీటి అవసరాలకు మాత్రమే నీరు అందించే పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు వరకు పంటపొలాలకు నీరు వదిలేది లేదని ప్రభుత్వం ప్రకటించింది. ఇదే పరిస్థితి తెలంగాణలో కూడా కొనసాగుతోంది. రుతువపనాల తరువాత తుపాన్ల సీజన్ ప్రారంభం అవుతుంది. ఆలోగా పంటలు చేతికి అందితే రైతు నష్టపోకుండా మంచి దిగుబడిని సాధిస్తాడు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఎదురైనప్పుడు పంట నష్టం తీవ్రత అధికంగా ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాలు పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతాలు కావడంతో వ్యవసాయం సరిగ్గా లేకపోతే ఆర్థికపరంగా అనేక సమస్యలు తలెత్తుతాయి. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపైనే కాకుండా అంటువ్యాధులు ప్రబలడానికి కూడా కారణంగా తయారైంది. మంచి నీటి వనరులు ఎండిపోవడంతో అంటువ్యాధులు ప్రబలడానికి అవకాశం ఏర్పడింది. రెండు రాష్ట్రాల్లో ఒక్కసారిగా ప్రబలిన అంటువ్యాధులను నిరోధించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. వాతావరణ నిపుణులు పేర్కొంటున్న ప్రకారం జులై రెండవవారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికే రైతులు ఒక విడత దుక్కిదున్ని, విత్తనాలు చల్లడం జరిగింది. అందుకు అనుగుణంగా కొన్ని ఎరువులు కూడా ఖర్చు చేశారు. ప్రస్తుతం మళ్లీ కొత్తగా వ్యవసాయ పనులు ప్రారంభించాలంటే పెట్టుబడి ఖర్చు పెరిగే అవకాశం ఉంది. మరోపక్క బంగాళాఖాతంలో అక్టోబరు నుంచి తుఫానులు ప్రారంభం అవుతాయి. ఆ సమయంలోగా పంటలు చేతికి వస్తే రైతులకు నష్టం ఉండదు. పంట ఎదుగుదల స్థితిలో ఉండగా తుఫానుల వల్ల భారీ వర్షపాతం నమోదు అయితే పంట చేతికి అందక పంట నష్టం తీవ్రస్థాయిలో ఉంటుంది. ఇలాంటి విపత్కర పరిస్థితులు దాపురించడానికి వాతావరణం కాలుష్యంలో కలుగుతున్న పెనుమార్పులు ప్రధాన కారణం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై దృష్టిసారించి కఠినంగా వ్యవహరిస్తే కొంతవరకు సత్ఫలితాలను పొందే అవకాశం ఉంటుంది. చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. పట్టణాలు, నగరాలు అతివేగంగా విస్తరించడంలో అందుకు అనుగుణంగా పర్యావరణ నష్టం కలుగుతోంది. క్రిమినల్ చట్టాలను మార్చి కొత్తవాటిని అమలుచేస్తున్నారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చట్టాలను రూపొందించి అమలుచేసినప్పుడే భావితరాలకు సహజవనరులు అందించే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వాలు చట్టాల రూపకల్పన, పర్యావరణ పరిరక్షణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

వనాల నుంచి.. జనాల్లోకి!

నగరంలో కుక్కల బెడద, శివార్లలో వన్యమృగాల బెడదతో అటు శివార్లగ్రామాల ప్రజలు, ఇటు నగర ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. అడవుల్లో నివసించాల్సిన వన్యప్రాణులు జనావా సాల్లోకి వచ్చి పంట నష్టాన్ని, సాధుజంతువుల ప్రాణనష్టాన్ని, కొన్నిసార్లు మనుషుల్నీ వదలకుండా అలజడిని సృష్టిస్తున్నాయి. అసలు ఈ వన్యప్రాణులు అడవిని వీడి జనావాసాల్లోకి ఎందుకు వస్తున్నాయి.

కవర్ స్టోరీ

ఎం.వెంకటేశ్వర రావు

ప్రకృతిలో సమతుల్యత కోసమే భూగోళం మీద జీవం అనేక రకాల జీవరాసులుగా పరిణామం చెందుతూ వస్తోంది. అడవిలో ఆహార గొలుసు అమరిక ఉంటుంది. మొక్కలు, చెట్లు, గడ్డి ఆహారంగా తీసుకుని లేళ్లు, జింకలు లాంటి సాధు జంతువులు వాటితోపాటు శాకాహార జంతువులను ఆహారంగా తీసుకునే పులులు, సింహాలు, చిరుతలులాంటి క్రూరమృగాల పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయి. అడవిలో పచ్చదనాన్ని కాపాడాలి..అంటే సాధు జంతువుల సంఖ్య అదుపులో ఉండాలి. దానికోసం పులులు, సింహాలు లాంటి వాటి అవసరం తప్పనిసరి. ఈ క్రూరజంతువులు లేకపోతే జింకలు, లేళ్లు, దుప్పులు వంటి శాఖాహార జంతువుల సంఖ్య అదుపులేకుండా పెరిగిపోతుంది. చివరికి అడవి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. అడవి అంటే వృక్షాలు, జలపాతాలు, పక్షులు, సర్పజాతులు, వన్యమృగాలు పచ్చదనంతో జనసంచారం తక్కువగా ఉండే రమ్యమైన ప్రదేశం. అడవులు వర్షపాతానికి ప్రధాన ఆధారం. అనేక రకాలైన ఆహార పదార్థాలు, ఇతర ఉపయోగకరమైన వస్తువులు పుష్కలంగా లభించే ప్రదేశం. జల వనరులకు ఆలవాలం. భూమి ఉపరితలం మీద 9.4శాతం అడవులు ఆక్రమించుకున్నాయి. అడవుల్లో స్వేచ్ఛగా తిరగాల్సిన వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయంటే.. నానాటికి అంతరించిపోతున్న అడవులే కారణం. ఒకప్పుడు అడవులు దట్టంగా ఉండటంతో వన్యప్రాణులకు అవసరమైన ఆహారం, నీళ్లు అక్కడే లభించేవి. క్రమంగా అడవుల నరికివేత అక్రమ కలప రవాణా కారణంగా అడవులు అంతరించిపోతున్నాయి. దీనికితోడు వర్షాభావ పరిస్థితుల వల్ల చెట్లు చిగురించే పరిస్థితి లేదు. దీంతో అడవుల్లో నిలువ నీడలేక, సరైన ఆహారం దొరక్క వన్యప్రాణులు అరణ్యం నుంచి జనావాసాల్లోకి వస్తున్నాయి. నగరాలు రోజురోజుకి విస్తరిస్తున్న క్రమంలో అడవులు, దట్టమైన పొదలను నరికి నివాస ప్రాంతాలుగా మారుస్తున్నారు. దీంతో అటవీప్రాంతాల్లో ఉండాల్సిన మూగజీవాలకు, క్రూరజంతువులకు నివాసం కరవవుతోంది. అందువలన అవి సమీపగ్రామాల్లో ఆవులు, మేకల మందలపై బడి చంపి తినేస్తున్నాయి. అడవుల్ని నేలకూల్చి లేఅవుట్లుగా మారుస్తుండటంతో ఆశ్రయం కరువై అనువైన ప్రదేశాల కోసం అడవి జంతువులు వెతుకులాడుతున్నాయి. అందుబాటులోని గ్రామాలు, పంట పొలాల్లోకి చొరబడి ఆకలి తీర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. హైదరాబాద్ శివార్లలో చిరుతపులుల వరుస దాడులతో జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. అడవిజీవులు ఆకలితో అలమటిస్తున్నాయి. తాగేందుకు నీళ్లు, తినేందుకు తిండిలేక అడవి మృగాలు అడవిని వీడి పల్లెలకు పరిగెత్తు కొస్తున్నాయి. మూగజీవాలను చంపేస్తున్నాయి. జనం బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఎండలు మండిపోతున్నాయి. అడవుల్లో వాగులు, వంకలు వట్టిపోతున్నాయి. ఊట నీటికి కటకట ఏర్పడుతోంది. వన్యప్రాణులు ఆకలి దాహం తీర్చుకునేందుకు జనబాహుళ్యంలోకి చొచ్చుకు వస్తున్నాయి. శ్రీశైలం పరిధిలో చిరుత పులులు, ఎలుగుబంట్లు, జింకలు, అడవి పందులు తదితర అన్ని వన్యజంతువులు ఆకలి దప్పికలు తీర్చుకునేందుకు సమీప ప్రాంతాల పొలాల్లోకి, గ్రామాలపై విరుచుకుపడుతున్నాయి. ఆకలితో ఆవురావు మంటూ గ్రామాల్లో ఉండే సాధుజంతువులైన ఆవులు, కుక్కలు, బర్రెలను చంపేస్తున్నాయి.

ముఖ్యంగా శ్రీశైలం ఘాట్‌రోడ్‌లోని నల్లమల అభయారణ్యం వెంట పాతాళగంగమెట్ల మార్గం దగ్గర పరిసరాల్లో చిరుతలు, ఎలుగుబంట్లు తరచూ సంచరిస్తుంటాయి. శేషాచలం అడవుల నుండి తరచు క్రూరమృగాల బాధ స్థానికులకు, భక్తులకు

తప్పడం లేదు. కొన్ని దశాబ్దాల ముందు అడవులు అడవులుగానే ఉండేవి. ఎప్పుడైతే రియల్ ఎస్టేట్ బూమ్‌నగరాల్లో విస్తరిస్తూ పరిధులు దాటి శివారుగ్రామాల్ని దాటి, వాటి పక్కన ఉన్న అడవుల్లోకి విస్తరిస్తూ పోతుండటంతో దట్టంగా ఉండే అడవులు క్రమక్రమంగా అదృశ్యమై పోతున్నాయి. వన్యప్రాణాలకు ఆల వాలంగా ఉండే అడవులు అంతరించి పోతున్నాయి. ఒకప్పుడు వన్యప్రాణులు అడవుల్లోనే ఉండేవి. అవి అడవిలో లభించే ఆహారంతోనే కడుపునింపుకునేవి. అడవుల్లో ప్రవహించే వాగువంకల నీటితోనే నిర్భయంగా దాహం తీర్చుకునేవి. మనిషికి విజ్ఞానంతోపాటు అంతులేని ధనాశ నానాటికి పెరిగిపోతూ దృష్టి ఎల్లలుదాటి అడవుల అంతానికి నడుం బిగించింది. క్రమంగా అది భూ ఆక్రమణల వలన అడవులు అంతరించడం ప్రారంభమైంది. తత్ఫలితంగా అడవుల్లో ఆహారం లభించక, ఆకలికి తాళలేక గ్రామాల్లో చొరబడుతున్న క్రూరమృగాలు సాధుజంతువులనే కాక మనుషుల ప్రాణాలను హరిస్తున్నాయి. రిజర్వ్ ఫారెస్ట్‌ని ఆనుకుని ఉన్న గ్రామాల్లోకి ప్రజలు ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకొని జీవిస్తున్నారు. అడవుల్లో వన్యమృగాలసంఖ్య పెరుగుదలతో అడవిలో ఆహారం, నీళ్లు, ఆవాసాల కొరత వలన ఊళ్లల్లోకి ప్రవేశించి బీభత్సం సృష్టిస్తున్నాయి. పంటపొలాలోల ఏనుగులు, ఎలుగుబంట్లు అడవిపందులు వంటి జంతువులు సృష్టిస్తున్న అరాచకంతో ప్రజలు భయకంపితులు అవుతూ జీవిస్తున్నారు. వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయని తెలిసి వేటగాళ్ల మాటు వేసి వాటిని సంహరించి, కాసులు చేసుకుంటున్నారు. వన్యప్రాణాల్ని రక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం శోచనీయం. ఘాట్‌రోడ్ ప్రాంతాల్లో చిరుతలు, పెద్దపులులు వంటి క్రూరజంతువులే కాకుండా ఏనుగులు, జింకలు తరచూ కనిపిస్తూ భక్తులకు పాదచారులను భయకంపితులను చేస్తున్నాయి. నల్లమల అడవులు, శేషాచలం అడవుల నుంచి ఘాట్‌రోడ్ మీద సంచరిస్తూ కొండకు నడిచి వెళ్లే భక్తులపై దాడి చేసి చంపేస్తున్నాయి.

కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా జనసంచారం లేక తిరుమల ఘాట్‌రోడ్‌పైనే కాక, పాపనాశనం దగ్గర జనావాసాల దగ్గరకు తిరుమల రోడ్లమీద ఏనుగులు, దుప్పులు, జింకలు, పాములు, చిరుతలు సంచారం చేయడం మొదలుపెట్టాయి.

కొన్నాళ్ల క్రితం తిరుమల కొండకు వెళ్లే పాదచారులకు ప్రభుత్వం క్రూరమృగాల నుండి రక్షణ కోసం పెద్ద చేతికర్రలు సరఫరా చేశారు.

అడవి జంతువులు, అడవి ఉత్పాదనల అక్రమ రవాణా చట్టవిరుద్ధంగా అడవి జంతువులని వృక్షాలను వాటి ఉత్పత్తులను (చర్మం, ఆకులు, పూలు, గింజలు) వస్తువుల అపహరణ, రవాణా, అమ్మకంలాంటివి మనిషి తనకు అనుకూలంగా ఆదాయ వనరులుగా ఎలా వాడుకోవచ్చో తెలుసుకున్నాడు. అడవిని కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు కళ్లుగప్పో లేక వారితో కుమ్మక్కయ్యో అటవీ సంపదను కొల్ల గొట్టడానికి మనిషి అలవాటు పడ్డాడు. ముఖ్యంగా ఏనుగుల దంతాలు, జంతువుల చర్మాలు, కొమ్ములు, పులల అస్థిపంజరం వంటి భాగాలు మనిషికి ఆదాయ వనరులుగా మారాయి. దేశవిదేశాల్లో వీటిమీద కోట్లలో వ్యాపారం ఉంటోందన్న అంచనా. ఆఫ్రికాలో కోతి మాంసం, చైనాలో ఏ మాంసమైన ఆరికి సర్పజాతులను, కప్పజాతులను కూడా వదలకుండా ఆహారంగా తీసుకుంటారు. అయితే ఔషధాల తయారీలో ఖడ్గమృగం కొమ్ములను, పెద్దపులి ఎముకలను ఇతర జంతువుల శరీర భాగాలను ఉపయోగిస్తున్నారు. వీటిపై చట్టాలున్నప్పటికీ ఎప్పుడూ అవి కళ్లు తెరిచి చూడవు. పెంపుడు జంతువుల విషయానికొస్తే ఆ ప్రాంతానికి చెందని జంతువులను, పక్షులను, పెంపుడు జంతువులుగా పెంచుకోవడం చాలామంది ప్రతిష్టగా భావిస్తున్నారు. ఖర్చుతో కూడుకున్న విషయం అయినా మనిషి మారడం లేదు. రకరకాల విదేశీ కుక్కలు, డ్రాగన్ బల్లులు, ఉడుములు, పక్షులు, పెద్ద పెద్ద చిలుకలు, గద్దలు.. ఒక్కటేమిటి.. కాదేది పెంచుకోవడానికి అనర్హం అన్నట్టు పెద్ద పులులను కూడా పెంపుడు జంతువులుగా మార్చుకుంటున్నారు. అడవుల్లో ఉంటున్న జంతువులను వేటాడుతూ వాటిని ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి తరలిస్తూ వ్యాపారం సాగిస్తున్నారు.

ఇలా తరలించే క్రమంలో బట్వాడా అయ్యే రోగ రోగ కారకాలు అటు మనుషులకు, ఇటు జంతువులకు సోకుతున్నాయి. సార్స్, బర్డ్ ఫ్లూ, మనీపాక్స్, హెర్పస్ బి వైరస్, సాల్మోనెల్లా వంటి వ్యాధులు... ఇలా ప్రబలిపోతున్నవే.

జనావాసాల్లో సంచరిస్తున్న క్రూర మృగాలను వాటి పాదముద్రల ద్వారా కనుక్కుంటారు. పాదముద్ర ద్వారా కనుగొనే పద్ధతిని సరోజ్‌రాజ్ చౌదరి కనిపెట్టారు. ఇటీవల క్రూర మృగాల మలవిసర్జన సేకరించి డిఎన్ఎ ద్వారా జన్యు విశ్లేషణ చేసి, అది జంతువో కనుగొంటున్నారు. అలాగే సి.సి. కెమెరాల ద్వారా ఆ ప్రాంతంలో సంచరించే జంతువులను కనుగొంటున్నారు.

క్రూర మృగాల్లో పెద్దపులి చాలా సెన్సిటివ్. మనిషిని చూడగానే పక్కకు తప్పుకొని వెళ్లే లక్షణం దానిది. భయపడకుండా, దాని జోలికి వెళ్లకుండా వుంటే దాని అంతట అదే తప్పుకుని పోతుంది. అడవులు పెరగాలంటే పెద్దపులిని సంరక్షించాలి. పులులను పెంచితే అడవులు వృద్ధి అవుతాయి. అందుకే ఇటీవల విదేశాల నుండి పులులను ప్రభుత్వమే తీసుకొచ్చి మన దేశంలో వాటిని సురక్షిత ప్రాంతంలో వదిలారు.

నేషనల్ టైగర్ సంరక్షణ సంస్థ:

దీనిని 1975లో ఏర్పాటు చేశారు. శాంక్చురీ యాక్ట్ ప్రకారం అడవిలోకి ప్రవేశించడం నేరం. అంతేకాకుండా అడవి జంతువులను వేటాడటం చట్ట ప్రకారం నేరం కిందే పరిగణించబడుతుంది. వన్య మృగ సంరక్షణ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం అటవీశాఖ కొన్ని ప్రాజెక్టులను చేపట్టింది. వాటిలో ముఖ్యంగా టైగర్ ప్రాజెక్ట్, ఎలిఫెంట్ ప్రాజెక్ట్, ప్రాజెక్ట్ హంగల్, ప్రాజెక్ట్ క్రోకడైల్ వంటివి ఉన్నాయి.

ఏఏ ప్రాంతాల్లో వన్యప్రాణులు, మృగాలు గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నాయి?

రెండు తెలుగు రాష్ట్రాల శివారు గ్రామాలు, ఘాట్ రోడ్లలో తరచూ వన్యమృగాలు ప్రవేశిస్తూ మనుషుల్ని, సాధు జంతువుల్ని సంహరిస్తున్నాయి. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా అన్నాజీపల్లిలో చిరుతపులి ఇటీవల హల్చల్ చేసింది. వేసవి ఎండ తీవ్రతకు, వడగాల్పులకు మెదక్ జిల్లాలో మూగజీవాలు అడవి ఉండి చుక్క నీరు దొరక్క నీటి జాడల వైపు గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. తుక్కాపూర్, భోగాపూర్‌లలో ఓ చిరుత ఏకంగా 9 మందిపై దాడి చేసింది. ప్రభుత్వాలు కేటాయించే నిధులు పక్కదారి మళ్లడం వల్ల ఎన్నో మూగజీవాలు అభయారణ్యాల్లో నీళ్ల దొరక్క అంతరించిపోతున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలోనూ, కరీంనగర్, పోచారం శివారు గ్రామాల్లో వన్యమృగాలు ప్రవేశించి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ కళ్యాణదుర్గంలోను కొమరంభీం జిల్లాలో, సిద్ధిపేట, శ్రీశైలం దగ్గర ఉన్న సున్నిపెంట పరిసర ప్రాంతాల్లో క్రూర మృగాలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. మనుషులు చేస్తున్న తప్పిదాలకి వన్యమృగాలు జనావాసాల్లోకి వస్తున్నాయి. వాటి ఆవాసాలు కోల్పోవడంతో జనాల మధ్యకు వచ్చి వాటి ఆహారాన్ని వెతుక్కుంటున్నాయి.

మనిషి విలాసవంతమైన జీవితాన్ని గడపటానికి అనువైన ప్రదేశాలు, గృహాలు నిర్మించుకోవడానికి మనిషి అడవుల్ని, కొండల్ని సైతం వదలకుండా ఖాళీ స్థలాల కోసం పరిగెత్తుతున్నాడు.

క్విట్ ప్రోకోలాగా మనిషి అరణ్యాలను ఆక్రమించుకుంటూ అడవుల్ని కబ్జా చేస్తుంటే మేమేం తక్కువ కాదు.. అన్నట్టు అడవి జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయి. వాతావరణం మార్పులు, వర్షాభావం వంటి కారణాలతో అడవిలో చెట్ల పెరుగుదలకు, వన్యప్రాణుల ఆవాసానికి అంతరాయం ఏర్పడటంతో గ్రామాల్లోకి క్రూరమృగాలు చొచ్చుకుని వస్తున్నాయి.

కాదేదీ వ్యాపారానికి అనర్హం అని శ్రీశ్రీ అన్నట్టు.. మనిషి స్వార్థం అడవిలో కలప, జంతువుల దంతాలు, జంతువుల చర్మాలు, జంతువుల గోళ్లు, జంతువుల అస్థిపంజరాలు కూడా విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు. మనిషి తానొక్కడే ప్రకృతిపై ఆధిపత్యం చెలాయించాలని అనుక్షణం అనుకుంటున్నాడు. కానీ ప్రకృతిలో ప్రతి ప్రాణి తన వంతు పాత్ర పోషిస్తుందని, జంతువుల జీవన చక్రం, ఆహారపు గొలుసులో ప్రతి జంతువుకు స్థానం ఉంటుందని మర్చిపోతున్నాడు.

జనావాసాల్లోకి ప్రవేశిస్తున్న వన్యప్రాణులు కలిగిస్తున్న నష్టాలు గత కొన్నాళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మనుషులపై పెద్ద పులుల దాడులు పెరిగిపోతున్నాయి. బీబీసీ లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం 25 మంది మనుషులు పులివాత పడుతున్నారు. ఒక్క మహారాష్ట్రలోనే 2020లో 31 మంది పులివాతబడి మరణించారు.

అడవిని ఆనుకుని ఉన్న సమీప గ్రామాలలో ప్రవేశిస్తున్న వన్యమృగాలు ముఖ్యంగా రైతులకు చుక్కలు చూపిస్తున్నాయి. అడవిపందులు అర్ధరాత్రి పంటపొలాల్లోకి గుంపులుగా ప్రవేశించి విత్తనం నాటిని దశ నుండి పంట చేతికి అందే దశలోనూ పంటలు నాశనం చేస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పాముకాటు వల్ల సంవత్సరానికి లక్ష మందికి పైగానే

మరణిస్తున్నారు. ఏనుగుల వల్ల దాదాపు 500 మంది ప్రాణాలు కోల్పోవడం, గాయపడటం జరుగుతోంది. వన్యమృగాలు సాధు జంతువులైన మేకలను, గొర్రెలను, ఆవులను చంపేస్తున్నాయి. మనషులపై దాడులు చేస్తున్నాయి. మానవ తప్పిదాలలో ముఖ్యంగా అభయారణ్యాలకు, అడవుల అభివృద్ధికి ప్రభుత్వాలు కేటాయిస్తున్న బడ్జెట్లు సరైన మార్గంలో వినియోగం కావటం లేదు. ఆ నిధులను రాజకీయ నాయకులు పక్కదోవ పట్టిస్తున్నారు. అధికారులు స్వలాభం కోసం అమూల్యమైన అటవీ సంపదను అక్రమ రవాణాకు సహకరి స్తున్నారు. తిరుమలలోని శేషాచలం అడవులలో అరుదుగా లభ్యమయ్యే ఎర్ర చందనం అక్రమ రవాణా జగద్విత‌మే.

గ్రామాల్లోకి ప్రవేశించే క్రూర మృగాలు ఎదురు పడితే తక్షణం తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

పులి ఎదురైతే కదలకుండా నిలబడాలి. దాని కళ్లల్లో కళ్లు పెట్టి చూడకండి. ఎదురుగా నిలబడి మెల్లగా అడుగులు వెనక్కి వేయాలి. పులి ఎదురైనప్పుడు భయంతో యూరిన్ పాస్ చేయ కూడదు. ఆ వాసనకు ఆకర్షించబడి కచ్చితంగా టాక్ చేస్తుంది. ధైర్యం కోల్పోయి పరిగెత్తకూడదు. మీతో చిన్న పిల్లలు ఉంటే వాళ్లని మీ భుజం మీదకి ఎక్కించుకోవాలి. అప్పుడు పులి దానికంటే మీరేదో పెద్ద జంతువు అనుకుని పారిపోతుంది. గట్టిగా అరవండి. పులి వెనక్కి తగ్గుతుంది. కింద పడి చనిపోయినట్టు నటించకండి. పులి ఎదురైనప్పుడు వాటిని ముద్దాడే ప్రయత్నం చేయకండి. అవేమీ చేయకపోవచ్చు. కానీ సమీపంలో ఉండే దాని తల్లి వేగంగా ఎటాక్ చేస్తుంది. పులి ఎక్కలేని ఎత్తైన చెట్లు ఎక్కండి. నీళ్లలో దాక్కునే ప్రయత్నం మాత్రం చేయకండి.

జంతువులు తరిమితే వెంటనే పరిగెత్తకండి. మీ దగ్గర ఉన్న క్యాప్ లేదా కర్చీఫ్ తీసి అవి దగ్గరకు వచ్చేంతవరకు ఊపుతూ ఉండండి. దగ్గరకు వచ్చాక మీ చేతిలో ఉన్న వస్తువును దూరంగా విసిరేస్తే దాని దృష్టి మళ్లి వెళ్లిపోతుంది.

లక్షల్లో 80 శాతం పాములకు విషం ఉండదు. కేవలం 20 శాతం పాముల్లోనే విషం ఉంటుంది. అది ఎప్పుడు పడితే అప్పుడు కాటు వేయదు. పాము ఎదురైనప్పుడు జిగ్‌జాగ్‌లా పరిగెత్తండి.

భూమిని గట్టిగా తన్నుతూ పరిగెడితే ఆ వైబ్రేషన్స్‌కి పాము వెనక్కి తగ్గుతుంది.

ఎలుగుబంట్లు గంటకి 51 కిలోమీటర్ల స్పీడ్‌తో పరిగెడతాయి. అవి దాడి చేయడానికి వస్తే కిందపడి ముడుచుకుపోయి చేతులతో మెడను కవర్ చేసుకోవాలి. మీరు చనిపోయారనుకుని అది మీ దగ్గరకు రాదు. ఒకవేళ దగ్గరకు వచ్చి చుట్టూ తిరిగినా, కదలకుండా అదే స్థితిలో ఉండాలి.

మొసళ్లు జనావాసాల్లోకి వచ్చి ఎదురైతే జిగ్‌జాగ్‌లా పరిగెత్తాలి. దగ్గరగా వస్తే దాని కాళ్ల పైన, శరీరంపైన, నోటిపైన కొట్టకూడదు మొసలి కళ్లు చాలా సెన్సిటివ్‌గా ఉంటాయి. కళ్లమీద కొట్టి ప్రమాదం నుంచి బయట పడవచ్చు.

సింహాలు ఎదురైనప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలి. అది మిమ్మల్ని చూసిన ఐదు పది సెకండ్లలో చంపేస్తుంది. దాని ఐ కాంటాక్ట్ మిస్ అవ్వకూడదు. పెద్దగా అరిచినట్లు మాట్లాడాలి. సమీపంలో ఉన్న ఏ వస్తువైనా చేత్తో పైకి లేపి పట్టుకుంటే దానికంటే మీరు పెద్ద జంతువు అనుకొని వెనక్కి తగ్గే అవకాశం ఉంటుంది.

ఏనుగులు ఎదురైనప్పుడు అవి సాధారణంగా దాడికి పాల్పడవు. వాటి పిల్లలకు ఆపద అనుకొని భావించినప్పుడు మాత్రం అవి చంపడానికి కూడా వెనుకాడవు. అలాంటి పరిస్థితుల్లో పెద్ద పెద్ద చెట్ల వెనక దాక్కుంటూ దగ్గరకు రాగానే వాటి చుట్టూ తిరుగుతూ అదను చూసి పారిపోయే ప్రయత్నం చేయాలి.

ముగింపు:

జ్ఞానం ఉన్న మనుషులు తప్పుల మీద తప్పులు చేస్తూ అడవులను ఆక్రమిస్తూ, వన్య ప్రాణుల ఆవాసాల్లోకి ప్రవేశిస్తూ, అడవులను నాశనం చేస్తూ, వన్యమృగాలకు, ప్రాణులకు ఆహారం, నీరు దూరం చేస్తూ వాటిని కాపాడాల్సిన మనుషులే వాటిని కబళిస్తూ వదలకుండా వ్యాపారం చేస్తుంటే జనావాసాల్లోకి అవి కనీసావసరాలు తీర్చుకోవడానికి వస్తున్నాయి. వాటిని మళ్లీ సంహరించడానికి ప్రయత్నించటం సబబేనా? ఒక్కసారి ఆలోచించండి.

'గోవుల గోపన్న' అనే పాత సినిమాలో 'వినరా! వినరా! నరుడా! తెలుసుకోర పామరుడా/గోమాతను నేనేరా నాతో సరిపోలవురా' అనే పాటలో ఆవు గొప్పదనాన్ని చాలా గొప్పగా రచయిత. అలాంటి సాధు జంతువుల్నే వధించి వాటి మాంసం తినే సంస్కృతిలో మనిషి బతుకుతున్నాడు. ఆవుల్నే కాదు అడవిలో లభించే ఏ జంతువునూ వదలడం లేదు. పర్యావరణంలో జంతువులు ఒక భాగమే. మనిషి జంతువులకు హాని తలపెట్టనంతవరకు ఏ జంతువూ మనిషికి హానికరం కాదు. అడవుల్ని కాపాడుదాం, పెంచుదాం, వన్యప్రాణులకు పంచుదాం.



మార్కెట్లో కొత్తగా

ఎగ్ మిక్సర్

కొంతమంది పెద్దలు, చాలామంది పిల్లలు..ఉడికించిన గుడ్డులోని పసుప్పచ్చటి భాగాన్ని తినడానికి పెద్దగా ఇష్టపడరు. కానీ చిత్రంలోని ఈ ఎగ్‌మిక్సర్ ఇంట్లో ఉంటే, గోల్డెన్ ఎగ్‌నూ చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఆరగించేస్తారు యమ్మీ అంటూ. జానా బెత్తెడుకి కాస్త తక్కువగా ఉండే ఈ ఎగ్‌మిక్సర్‌లో ఒకే ఒక్క గుడ్డు పడుతుంది. బేస్‌మెషిన్, పైన ఉండే క్యాప్‌తో పాటు.. దీని లోపల సిలికాన్ ప్యాడ్, షీల్డ్‌కవర్ గుడ్డు ఆకారంలో చిన్నగా ఉంటాయి. వాటి మధ్యలోనే గుడ్డును సెట్ చేసి..పైన క్యాప్‌పెట్టి..మెషిన్ ఆన్ చేస్తే చాలు. లోపల సిలికాన్ బౌల్ 360 డిగ్రీస్ తిరుగుతూ గుడ్డులోపలి సొనలను బాగా మిక్స్ చేస్తుంది. అనంతరం ఆ గుడ్డును..మిక్సర్ నుంచి తీసి ఉడికించి, పైపెంకును తొలగిస్తే..గోల్డెన్‌కలర్లలో ఊరిస్తూ కనపడుతుంది. ఈ గోల్డెన్ ఎగ్‌ని గుండ్రంగా ముక్కలు చేసుకుని.. శాండ్విచెస్‌లో, కట్లెట్స్‌తో కలిపి తినొచ్చు. ఈ మెషిన్‌కి పవర్ కనెక్టర్ ఉండటంతో డైరెక్ట్‌గా పవర్ బటన్ ఆన్ చేసుకుని సులభంగా వినియోగించుకోవచ్చు.

బెస్ట్ ఎలక్ట్రిక్ కెటిల్

లీటరున్నర సామర్థ్యం కలిగిన ఈ ఎలక్ట్రిక్ కెటిల్‌లో పాస్తా, టీ, కాఫీ, సూప్ ఇలా ఎన్నిటినో సిద్ధం చేసుకోవచ్చు. అలాగే ఇందులో కోడిగుడ్లనూ ఉడికించుకోవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందిన ఈ డివైస్..2000 వాట్స్‌తో, ఆటోమేటిక్ స్విచ్ ఆఫ్ ఆప్షన్స్‌తో యూజర్ ఫ్రెండ్లీగా పనిచేస్తుంది. దీన్ని శుభ్రపరచుకోవడం ఎక్కడికైనా వెంట తీసుకెళ్లడం చాలా సులభం. దీని పైభాగంలో రిమూవబుల్ అండ్ వాషబుల్ ఫిల్టర్ ఉండటంతో బెస్ట్ కెటిల్‌గా మార్కెట్‌లో మంచి డిమాండ్‌ని సొంతం చేసుకుంటోంది. లుక్‌వైజ్‌గానూ ఆకట్టుకుంటోంది. ఇలాంటి డివైజ్‌లు ఓపెన్ కిచెన్‌కి భలే అందాన్నిస్తాయి.

ఇండియన్ ఎలక్ట్రిక్ ఫ్రైయర్

అధిక నాణ్యత గల స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించిన ఈ ఎలక్ట్రిక్ 10 లీటర్ల సామర్థ్యంతో చాలా వంటకాలను వేగంగా వండిపెడుతుంది. నూనెలో వేయించే వంటకాలకు ఇది అనువైనది. పెద్దపెద్ద రెస్టారెంట్స్‌లో, చిన్నచిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్‌లోనే కాదు మెస్‌లు, కేఫ్‌లలోనూ ఈ డివైస్ వాడకం ఎక్కువే. ఇది ఇంట్లో ఉంటే..ఎక్కువమంది విచ్చేసే పార్టీలు, ఫంక్షన్స్‌కి చక్కగా ఉపయోగపడుతుంది. 3500 వాట్స్‌లో పకోడీలు, బోండాలు, గారెలు, జంతికలు, కారప్పూస వంటివీ చక్కగా వండుకోవచ్చు. దీన్ని క్లీన్ చేయడమూ ఈజీనే.





మనసైన కాఫీ చిత్రాలు

ఈ చిత్రాలను చూస్తుంటే ఇంకా ఇంకా చూడాలనిపిస్తుంది కదూ! గుర్రం శ్రీనాథ్ కాఫీతో వేసిన చిత్రాలివి. 5సంవత్సరాల వయసు నుంచే శ్రీనాథ్ బొమ్మల్ని వేయడం ఆరంభించారు. చిత్రలేఖనమే తన జీవితంగా భావించి, ప్రముఖ చిత్రకారుల నుంచి స్ఫూర్తిని పొంది ఆ కళకు మరింత వన్నె తెచ్చుకున్నారు. అంతేకాదు కాఫీతో వేసిన ఈ చిత్రాలు పలు అవార్డులను, సర్టిఫికేట్లను సొంతం చేసుకున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూనే పలు చిత్రాలను వేస్తూ, పేరుప్రఖ్యాతులను పొందుతున్నారు. వీరు వేసిన బొమ్మలు విశాలాక్షి, ఆంధ్రభూమి వంటి మాస, వారపత్రికల్లో ప్రచురితమవడం మాత్రమే కాక పలు ఆన్‌లైన్ మేగజైన్లలోను ప్రచురితం అవుతున్నాయి. శ్రీనాథ్ కాఫీ చిత్రకళ నైపుణ్యాన్ని మీరు ఓసారి చూస్తే, మీకు ఇట్టే నచ్చుతాయి.

ప్లాస్టిక్‌తో ప్రళయం

ప్లాస్టిక్.. ప్లాస్టిక్.. ప్లాస్టిక్
ఎవరికి లాభం, దేనికి లాభం
భువికి, జీవికి అపార నష్టం
ప్లాస్టిక్‌ను మానకపోతే కష్టం
ప్రత్యామ్నాయం ఎంతో అభీష్టం!

కాగితపు సంచులతో
కడలి జీవికి కాంతులు
జనపనార సంచులతో
జగతికి, జనతకు జేజేలు
బట్టసంచులతో
భూమికి బలమైన పునాదులు!

అరటాకుల్లో
భోజనాలు
ఆరోగ్యానికి ఔషధ
గుణాలు
మోదుగ విస్తరాకుల్లో విందు
మానవ మనుగడకు పసందు!

ప్లాస్టిక్ వస్తువులతో ప్రమాదం
ప్రాచీన వస్తువులతో ప్రమోదం
మన మార్పే భవితకు ప్రసాదం.

– బోనరి పాండురంగ

కలల్ని స్వాగతించాలి

గాలిలో సూర్యోదయం
ఏ వాకిలి ముందు వాలుతుందో
ఏ కలువల ముగ్గును దీవించి
ఏ సంధ్యను చేరుతుందో
అనివార్యమైన నిరీక్షణ అయినా
కలల్ని స్వాగతించాలం
ఉషస్సు తోరణాల్ని అల్లడానికైనా
మనస్సైన దారుల్ని మలచుకోవడానికైనా
కలల్ని స్వాగతించాలి
మనుగడ సాగే ప్రభాతంలోకి
ఓ వెన్నెల అడుగు వేయాలి
అందుకే..
కలల్ని స్వాగతించాలి
రూపానికి, అలంకారానికి
వైవిధ్యమైన అలంకరణ చేయాలి
జీవన స్వప్నమొక చదరంగం
రాణిస్తేనే శుభోదయం
అందుకే కలల్ని స్వాతించాలి.

– రవి మాగంటి

ఈవారం కవిత్వం

ఉలిదెబ్బలతో
అద్భుత కళాఖండమై
సుందర దివ్య రూపమై
శిల శిల్పమై
రూపం దాల్చితే
సుస్వర మధుర రచనా గీతం
హృదయ రంజకమై
వెలుగొందు..
మనసులోని మధుర
భావజాలం
రసజ్ఞ కవి హృదిలో
జనించిన దివ్యామృత
కవితాధార
మనోరంజకం
కళారూపమై
వర్ధిల్లిన శిల
పరిణతి చెందిన
మనోజ్ఞ కళారూపం
కనులకింపైన
తేజో విరాట్ స్వరూపం.

– యలమంచిలి శివాజీ

ఆలోచనామృతం



మధురానుభూతుల ఖజానా..గోపి కవనసృజన

'ఈ మైదానం కేవలం ఖాళీస్థలం అనుకునేరు చరిత్రను కడుపులో దాచుకున్న జ్ఞాపకాల పురాస్థలం' అంటు అగ్రేసరకవి, డా॥ఎన్.గోపి తన 75వ జన్మదిన సందర్భంగా 75 కవితలతో వెలువరించిన యిరవైతొమ్మిదవ కవిత్వపొత్తం 'రేపటిమైదానం'. రేపటి యువత భవితను స్వప్నిస్తున్నాడు కవి. వస్తువు ఏదైనా గోపి దృష్టిని ఏమార్చలేవు. అత్యంత సరళంగా, అందరికీ అర్థమయ్యేలా కవితల్ని అల్లడంలో సిద్ధహస్తుడు. కవిత్వ పోషాళింపుకు కొదవ వుండదు. ఒకటా..రెండా ఏభయి వసంతాల సాహిత్యప్రస్థానం ఆయనది.

ఈ సంపుటిలో 'రొట్టె' గురించి రెండు కవితలు వున్నాయి. 'అక్కడక్కడ మాడితేనే నాకిష్టం/ అవి బుజ్జికండ్లుగా మారి నన్నే చూస్తున్న ఫీలింగ్' అంటూ..' మొత్తానికి రొట్టెలు తయారై బేసిన్‌లో పోగుపడ్డాయి/ తినే వాళ్లందరూ ఇష్టంగా భుజించి తృప్తిపడ్డారు' యిదీ రొట్టెల కథ. గతంలో 'రొట్టె గురించి రాశారు కదా' అని అడిగితే 'ఇంకా ఆకలి తీరలేదు' అంటారు గోపి. ఒక వస్తువుని ఎన్ని కోణాల్లో దర్శించినా విప్పవలసిన పొరలు యింకా వుంటాయని కవి చమత్కారం. ఎప్పటికీ ఆరని కవిత్వదాహం గోపీది.

'కవిత్వానికి హేతువు/ ప్రతిభ మాత్రమే కాదు/ పాఠకుని సుముఖ ప్రభ కూడా' తన కోసం రాసుకుంటూ పోవడమేకాదు..పాఠకుడ్ని తన కవిత్వం వెంబడి వేలు పట్టుకుని నడిపించడంలోనే కవి ప్రతిభ ద్యోతకమవుతుందని కవి భావం. 'కవిత్వం అబ్బిన తర్వాతనే కాస్త ఒకవాస్ నేర్చుకుంటున్నాను' అంటున్న గోపి కొందరు కవుల పోకడను చెప్పకనే చెప్తున్నారు. 'పొట్ట విప్పగానే రాలిపడిన ముత్యాలు/ ఎర్రెర్రని కెంపు రత్నాలు/ ఒకొక్కటి నీటి బిందువుని పీల్చుకుని/ తయారైన అనర్ఘదీపికలు' యింత రుచిగా దానిమ్మపండును ఎవరు తినిపించగలరు. గోపి తప్ప! మనిషికి అన్వయిస్తు 'అక్కడక్కడ దానిమ్మల్లాంటి పుణ్యపురుషులుంటారు/ పైకి సాదాసీదా/ లోపల సద్గుణాల ఖజానా' గోపి కవితల్ని చదవండి. మధురానుభూతులను ఆస్వాదించండి. **(రేపటి మైదానం, రచన: ఎన్.గోపి, వెల: రూ 200, ప్రతులకు: ఎన్.అరుణ, 13-1/బి, శ్రీనివాసపురం, రామంతపూర్, హైదరాబాద్)**

పుస్తక సమీక్ష

- రమణ వెలమకన్ని

సమవీక్షణం

ఒక వజ్రాల వ్యాపారి రత్నాలను పరీక్షించి వెలకట్టినట్లు, ఒక సమీక్షకుడు సాహిత్యాన్ని పరీక్షించి దాని నాణ్యతకు వెలకట్టగలడు. రాయిలోని లొసుగులు, గమనించి దాని విలువ పెంచే మార్గాలు సూచించగలడు. అట్లే, సమీక్షకుడు కావ్యాన్ని పరిశీలించి, మంచిచెడ్డలు నిర్ణయించగలడు. అందుకే సాహితీ స్రష్టలు ఎంతముఖ్యమో సమీక్షకులు కూడా సాహిత్యానికి అంతే ముఖ్యం. 'ముందుమాట'లు ఈ విధాయకాన్ని కొంతవరకు పూరించినా, అవి 'పాజిటివ్' కోణాల్నే విడమర్చటం వల్ల సమీక్షలు (సమవీక్షణం) అనలేము. దాశరథి, సినారె, గూడశ్రీరాములు అద్దేపల్లి లాంటి నాటితరం రచయితలేకాకుండా, అన్నవరం ఎలనాగ, చలపాకప్రకాశ్‌లాంటి నేటితరం రచయితలను కూడా సమీక్షించి పృధ్వీ తాను ఉభయకాల నేర్పరినని బుజువు చేసుకున్నారు. సాహిత్యం సమాజానికి, సమాజ సంస్కృతికి జీవగర్ర. అట్టి సాహిత్యాన్ని పోషిస్తున్న పట్టి, ఆయారచయితలను 'లైంలైటు'లో చూపించిన ఈ వ్యాస రచయితకు అభినందనలు. ఉత్తమాభిరుచిగల పాఠకులకు ఇది తప్పనిసరి గ్రంథం. **(సమీక్షణం, సాహిత్య సమీక్షావ్యాసాలు, రచన: ఎస్.ఆర్.పృథ్వి, వెల: రూ 150, ప్రతులకు: పి.ఉషారాణి, 104-6-140, ఎం.జి.వీధి, రామకృష్ణనగర్, రాజమహేంద్రవరం)**

- కూర చిదంబరం

హైదరాబాదీ కతలు-లక్ష్మణరావు పతంగే

హిందీ, ఉర్దూ, తెలుగు, మరాఠీ భాషలలో ప్రావీణ్యతగల సాహితీవేత్త, రచయిత లక్ష్మణ్‌రావు పతంగే, తెలంగాణ బాసలో 'హైదరాబాదీ కతలు' వెలువరించడం అభినందనీయం. హైదరాబాద్ మహానగర ఉత్తమసాహితీవేత్తగా ప్రశంసలు పొందుతున్న లక్ష్మణరావు పతంగే, ప్రతిభావంతుడైన వేళ్లమీద లెక్క పెట్టుకోవలసిన అరుదైన సాహితీవేత్త. హైదరాబాదీ అద్భుత విశిష్ట సంస్కృతి జీవనవారసత్వాన్ని పుణికి పుచ్చుకొన్న 'పతంగే' సాహితీ, సాంస్కృతిక మేధావిగా దశాబ్దాల తెలంగాణ సామాజిక నాటి, నేటి అనుభవాలను తన రచనలలో ప్రతిబింబింపచేస్తారు. ఆసక్తిగా అనుభవింపచేస్తారు. ఈ సంపుటిలో 25 కతలున్నాయి. మన్సుల మన్సులు వాళ్లచాతలు, కష్టాలు కన్నీళ్లు, ఆశలు, అడియాసలు అన్నీ గీకతలల్ల ఉన్నయి అంటారు రచయిత. అక్కడక్కడ పేపర్లల్ల వొచ్చిన సుద్దులేగాక, సొంతంగ రాసిన ఈ కవితలన్నీ సుఖాంతమైన ముగింపులు, మానవతా విలువలు, నిజాయితీ, జీవితాలకు అందించే సత్ఫలితాలు రచయిత కథారూపాలుగా తీర్చిదిద్దారు. తెలంగాణ పల్లెలలో కనపడే కల్మషం లేని మన్సులు మనల్ని పలకరిస్తారు. తెలంగాణ బాసలో యింత అద్భుతమైన కతలు రాసి, మాండలిక పలుకుబడిని సజీవసాహితీ చైతన్యంతో, తెలంగాణ సీమ అస్తిత్వఔన్నత్యాన్ని, సాంస్కృతిక వెన్నెల వెలుగులను కథారూపాలుగా లక్ష్మణరావు పతంగే ప్రదర్శింపచేస్తారు. **(హైదరాబాదీ కతలు, రచన: లక్ష్మణ్‌రావు పతంగే, వెల: రూ 125, ప్రతులకు: 18-1-292/47/బి/19, శివాజీనగర్, ఉప్పుగూడ, హైదరాబాద్)**

- యర్రమిల్లి

'మాయ'శ్చరైజర్..

తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

ప్రస్తుత రోజుల్లో ఉరుకులు పరుగుల జీవితంలో చాలామంది ప్రజలు తమ అందం, ఆరోగ్యం మీద అంతగా శ్రద్ధ చూపలేకపోతున్నారు.

ఒత్తిడితో కూడిన ఆఫీస్ వర్క్, ఇంటి పనితో అలసిపోయిన వారికి, కొంత విశ్రాంతి అనేది ప్రతి ఒక్కరికీ అవసరం. గాలిలో తేమ అధికమైనప్పుడు చర్మం హైడ్రేషన్‌కు గురి చేస్తుంది ఇది అలర్జీలకు దారి తీస్తుంది. నిద్రలేవగానే ఫ్రెష్‌గా కనబడాలంటే, నిద్రించడానికి ముందు మేకప్ మొత్తాన్ని పూర్తిగా తొలగించాలి. మస్కార, లిప్ కలర్, ఫౌండేషన్ మొత్తాన్ని

తొలగించాలి. చర్మం రంధ్రాలు ఫ్రీగా ఉండేలా చూసుకోవాలి. మేకప్ విషయం ఏ చిన్న పొరపాట్లు చేసిన న్యాచురల్ అందం కాస్తాపోతుంది, చూడటానికి అలసటగా కనబడతారు. చర్మాన్ని తేమగా ఉంచుకోవటమనేది దినచర్యలో అస్సలు వదిలేయ కూడదని పని. నిపుణులు చర్మసంరక్షణలో దీని ప్రాముఖ్యతను పదేపదే నొక్కి చెప్తారు. ఈ పని చర్మానికి కావలసిన తేమను అందించటమే కాదు, చర్మానికి నీటి ప్రసరణను పెంచి, మళ్లీ జీవం పోస్తుంది. చర్మానికి కొన్నిరకాల రసాయనాలు పడవు. ముఖ్యంగా బయోకెమికల్స్ రియాక్షన్‌ను ఇస్తాయి. చర్మం సరిగా హైడ్రేషన్ చెందకుండా ఉన్నట్లైతే, అప్పుడు ఇటువంటి రియాక్షన్స్ చర్మానికి హాని కలిగిస్తాయి. అటువంటి దుష్ప్రభావాలను నివారించాలంటే ఎల్లప్పుడూ చర్మాన్ని తేమగా ఉంచుకోవాలి. చర్మం డీహైడ్రేషన్‌కు గురి అవుతుందో, అంటే చర్మానికి సరిపడా తేమ అందడం లేదని గ్రహించాలి. దానివల్ల అనేక ఇన్ఫెక్షన్స్‌ను ఎదుర్కోవాల్సి వస్తుంది. మాయిశ్చరైజింగ్ చర్మానికి చాలా మేలు చేస్తుంది.

జిడ్డు చర్మానికి..మాయిశ్చరైజర్!

సాధారణంగా జిడ్డుచర్మతత్వం ఉన్నవారు బయటకు వెళ్లేటప్పుడు మాయిశ్చరైజర్ రాసుకోనవసరం లేదనుకుంటారు. వీళ్లకూ అది అవసరమే. ముఖం కడుక్కోవడం వల్ల మురికితోపాటు చర్మంలోని తేమ కూడా బయటకు వెళ్లిపోతుంది. ఇది జిడ్డుచర్మానికీ కూడా వర్తిస్తుంది. దాంతో చర్మం పొడిబారిపోతుంది. తరచూ ఇలాగే జరిగితే చర్మంపై సన్నటిగీతలు, ముడతలు మొదలవుతాయి. ఇవన్నీ జరగకుండా ఉండాలంటే నీటి ఆధారిత, నూనెలేని మాయిశ్చరైజర్‌ని రాసుకోవాలి.

జిడ్డు చర్మతత్వం ఉన్నవారు పైపైన ముఖాన్ని శుభ్రం చేసుకుంటే చాలనుకుంటారు. కానీ బాగా రుద్ది శుభ్రం చేయాలి. అప్పుడే చర్మరంధ్రాల్లో ఉండే ఫ్రీరాడికల్స్, మురికి తొలగిపోతాయి. తక్కువ గాఢత ఉండే జెల్‌ని ఉపయోగిస్తే మంచిది. ఇలా చేయడం వల్ల ముఖంలో రక్తప్రసరణ బాగా జరుగుతుంది.

ఆయిలీ స్కిన్ కలిగిన వారు మేకప్ అవాయిడ్ చేయాల్సిన అవసరం లేదు. అయితే, ఎటువంటి ప్రొడక్ట్స్ తమ చర్మానికి పడతాయో వీరు తెలుసుకుని ఆ ప్రోడక్ట్స్‌ని మాత్రమే వాడాలి. డ్రైస్కిన్‌కి మాత్రమే పరిమితమైన మేకప్‌రూల్స్ పాటించి డ్రైస్కిన్‌కై ఉద్దేశింపబడిన ప్రోడక్ట్స్‌ని వాడితే ఆయిలీ స్కిన్ వారి మేకప్ లుక్ పాడైపోవచ్చు. అలాగే, ఆయిల్ బేస్ట్‌ప్రోడక్ట్స్‌ను ఆయిలీస్కిన్ వారు వాడకూడదు. ఈ జాగ్రత్తలను తీసుకుంటే డబ్బు సమయం వృధా కాదు. జిడ్డుచర్మం ఉన్నవారు తరచూ మృతకణాలను తొలగించుకోవాలి అని చాలామంది అభిప్రాయం. అయితే తరచూ ముఖం కడగడం, ఎక్కువ ఒత్తిడితో నలుగుపెట్టడం, మృతకణాలను అదేపనిగా తొలగించాలనుకోవడం ఇవన్నీ చర్మానికి హాని చేస్తాయని మరవకూడదు. చర్మ సమస్యల్లో డ్రైస్కిన్ ఒక్కటి. ముఖ్యంగా వింటర్లో డ్రైస్కిన్ సమస్యలు ఎక్కువ. డ్రైస్కిన్ వల్ల అందాన్ని కోల్పోతారు. చూడటానికి చర్మం నిర్జీవంగా, వయస్సైన వారిలో కనబడుతుంది. కాబట్టి అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే, చర్మానికి తగిన హైడ్రేషన్ అవసరం. చాలామంది డ్రైస్కిన్‌కు మాత్రమే మాయిశ్చరైజింగ్ అవసరమనుకుంటారు, కానీ ఆయిల్‌స్కిన్, అన్ని రకాల కాంబినేషన్ స్కిన్‌కు మాయిశ్చరైజింగ్ అవసరం. ముఖ్యంగా వింటర్లో డ్రైస్కిన్ సమస్య ఎక్కువగా ఉంటుంది కాబట్టి శీతాకాలంలో మాయిశ్చరైజర్ తప్పనిసరి.

డ్రైస్కిన్ కోసం

సీజన్ ఏదైనా డ్రైస్కిన్ నివారించుకోవడానికి అనేక మాయిశ్చరైజర్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే కమర్షియల్ మాయిశ్చరైజర్స్‌కంటే, హోం మేడ్

మాయిశ్చరైజర్స్‌లో ఫ్రెష్ న్యూట్రీషియన్స్ అద్భుభణభతమైన ఫలితాలను అందిస్తాయి. ఏదో ఒక ఉత్పత్తి వాడితే చాలనుకుంటారు కొందరు. దానివల్ల అన్నిసార్లూ ఫలితం ఉండకపోవచ్చు. అందుకే చర్మతత్వానికి నప్పేదానికే ప్రాధాన్యం ఇవ్వాలి. నాణ్యమైనవాటిని ఎంచుకోవాలి.

మాయిశ్చరైజర్ అప్లై చేయడం వల్ల ఇది మేకప్‌కు మంచి ఫౌండేషన్ అవుతుంది. ఇది మేకప్ ముఖం మీద ఎక్కువ సమయం నిలిచి ఉండటానికి సహాయపడుతుంది.

మాయిశ్చరైజర్ ముఖం, మెడ, పెదాలు, ఐలిడ్స్, ముక్కుకు అప్లై చేయాలి. మాయిశ్చరౌజర్ చర్మంలోకి పూర్తిగా ఇమిడే వరకు ఉండి తర్వాత మేకప్ వేసుకోవాలి.

సంవత్సరం మొత్తం సన్‌స్క్రీన్ తప్పనిసరి. ఇది యూవీ కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. ఎల్లప్పుడు బోర్డ్‌స్పెక్ట్రమ్ సన్‌స్క్రీన్‌ను ఎంపిక చేసుకోవాలి. అంటే మినిమం 15 ఎస్‌ఎఫ్‌పి కలిగిన క్రీమ్ ఎంపిక చేసుకుని, ముఖం, మెడకు అప్లై చేయాలి. సన్‌స్క్రీన్ ప్రీమెచ్యూర్ ఏజింగ్, ముడుతలు, డార్క్‌స్పాట్స్, ఫ్రాక్సై మొదలైన సమస్యలను నివారిస్తుంది.

కొబ్బరినూనెను గోరువెచ్చగా చేసి తలపై అప్లై చేయడం ఒక పురాతన రెమెడీ. ఇలా కొబ్బరినూనెలను తలకు అప్లై చేయడం వల్ల జుట్టు తేమగా, సాఫ్ట్‌గా మాయిశ్చరైజింగ్ గుణాలు కలిగి ఉంటుంది. కొబ్బరి నూనె డ్రైస్కిన్ నివారణకు ఎక్సలెంట్ హోం రెమెడీ. అన్నిరకాల చర్మతత్వాలకు ఇది బెస్ట్‌గా పనిచేస్తుంది. ఈ నూనెను వారానికొసారి అప్లై చేస్తే చాలు బెటర్ రిజల్ట్స్‌ను అందిస్తుంది. రెగ్యులర్‌గా అప్లై చేస్తే స్మూత్‌గా సాఫ్ట్‌స్కిన్ పొందుతారు. తర్వాత వేడినీటితో శుభ్రం చేసుకోవాలి.

అరటిపండ్లలో ఎక్కువ మాయిశ్చరైజింగ్ గుణాలు ఉండటం వల్ల దీన్ని తలకు ఉపయోగిస్తుంటారు. జుట్టు సమస్యలను నివారించుకోవడం కోసం చాలామంది బనానా హెయిర్‌ప్యాక్‌ను ఇళ్లలో ప్రయత్నిస్తుంటారు. కాబట్టి, ఈ నేచురల్ రెమెడీతో మీరు కూడా మీ జుట్టును హెల్తీగా, మాయిశ్చరైజర్‌గా మార్చుకోండి. కేరట్ జ్యూస్‌లో స్మూతింగ్ గుణాలు అధికంగా ఉన్నాయి. ఇది చర్మానికి ఉత్తమమైనదని మీకు తెలుసా! కేరట్‌లో విటమిన్ ఎ అధికంగా ఉంది, కేరట్‌జ్యూస్‌లో రెండు మూడు టీస్పూన్ల మిల్క్‌క్రీమ్ జోడించి మిక్స్ చేసి అప్లై చేయాలి. కొన్ని నిమిషాల తర్వాత మెత్తటి టవల్‌తో తుడిచేయాలి. అలోవెర మొక్క ఉంటే చాలు ఇది చాలావేగంగా పెరుగుతుంది. ఇది హోంమాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది.

పైస్కిన్ తొలగించి లోపల ఉండే జెల్‌ను స్పూన్‌తో తీసుకోవాలి. తర్వాత మ్యాష్ చేయాలి. ఆలోవెరజెల్లో అధికంగా న్యూట్రీషియన్స్ ఉన్నాయి. విటమిన్ ఇ, విటమిన్ ఎలు అధికంగా ఉన్నాయి.

ఉల్లిపాయ జ్యూస్‌లో యాంటీసెప్టిక్ గుణాలు ఎక్కుగా ఉండటం వల్ల ఇది తలల ఇన్ఫెక్షన్స్‌ను దూరం చేస్తుంది. ఆనియన్ జ్యూస్‌ను నేరుగా తలకు అప్లై చేయడం లేదా ఇతర పదార్థాలతో కలిపి ఉపయోగించుకోవచ్చు. దాంతో జట్టు ఆరోగ్యంగా ఉంటుంది.

డ్రై అండ్ డల్‌స్కిన్ చూడటానికి చాలా అసహ్యంగా కనబడుతుంది. అయితే పరిష్కారం ఫ్రిజ్‌లో ఉంది. తాజా పాలలో గ్లోయింగ్ స్కిన్ కావల్సిన లక్షణాలున్నాయి. మిల్క్ క్రీమ్ చర్మానికి ఫెయిర్ నెస్ అందిస్తుంది. డార్క్‌సర్కిల్స్‌ను అందిస్తుంది. స్కిన్ టాన్ నివారిస్తుంది. మిల్క్ క్రీమ్ రెగ్యులర్‌గా మసాజ్ చేయడం వల్ల కచ్చితంగా మాయిశ్చరైజింగ్ లక్షణాలు అందిస్తుంది.

యాపిల్‌సైడర్ వెనిగర్‌లో ఆస్ట్రిజెంట్ గుణాలు అధికంగా ఉన్నాయి. ఇది అత్యంత పవర్‌ఫుల్ న్యాచురల్ రెమెడీ. డ్రైహెయిర్‌ను నివారించడంలో సహాయపడుతుంది. దీన్ని వాటర్‌తో మిక్స్ చేసి నేరుగా తలకు అప్లై చేయాలి. ఇది తలకు అవసరమయ్యే మాయిశ్చరైజర్, తేమను అందించి, తలలో ఇన్ఫెక్షన్స్ లేకుండా చేస్తుంది. బాదం నూనెలో విటమిన్ ఇ, విటమిన్ ఎ అధికంగా ఉన్నాయి. ఇందులో అద్భుతమైన ఆరోమా వాసన, గ్రేట్ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. మరో బెనిఫిట్ కూడా ఉంది. బాగా నిద్రపడుతుంది.

తేమలేని చర్మం సులభంగా పాడవటానికి వీలుగా మారుతుంది. ఇలాంటి చర్మం అలర్జీని కలుగచేసే పదార్థాలు, విషపదార్థాలు, ఫ్రీ రాడికల్స్, ఇన్ఫెక్షన్ల కలిగించే బ్యాక్టీరియా ఇలాంటివాటన్నిటికీ ఆవాసంగా మారుతుంది.

ఆలివ్ ఆయిల్ ఒక బెస్ట్ హోం రెమెడీ. డ్రైస్కిన్‌కు మంచి మాయిశ్చరైజింగ్ గుణాలను అందిస్తుంది. చర్మసమస్యలను నివారిస్తుంది. దీన్ని చర్మానికి అప్లై చేసి, మసాజ్ చేసుకోవాలి. దీన్ని రాత్రిల్లో అప్లై చేస్తే మరింత బెటర్ రిజల్ట్ పొందుతారు. మరుసటి రోజు స్నానం చేస్తే చాలా ఫ్రెష్‌గా అనిపిస్తుంది.

పురుషుల కోసం

సాధారణంగా పురుషుల చర్మం, స్త్రీ చర్మంతో పోలిస్తే 20శాతం మందంగా, రఫ్‌గా, ఆయిలీగా, గట్టిగా ఉంటుంది. పురుషులు ఉపయోగించే స్కిన్ క్రీముల్లో తప్పనిసరిగా బొటానికల్ ఎక్స్‌టాక్స్, యాంటీయాక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్, ఎసెన్సియల్ ఆయిల్స్ ఫాటీయాసిడ్స్ కలిగి ఉండాలి.

(మిగతా 19వ పేజీలో)

కథ

కరవు కథ

మిట్ట మధ్యాహ్నం చంద్రమ్మ తన పొలం దగ్గర ఉన్న చల్లని ఓ చింతచెట్టు నీడన కూసోని, ఎండకు మెరుస్తున్న ఆ వరి పొలాన్ని చూస్తూ కళ్లెంట నీలెట్టుకుంది. అటుగా వచ్చిన ఆమె పెనిమిటి బాలపీరు, ఏడుస్తున్న తన పెళ్లాం పక్కన కూసెని పచ్చడి మెతుకులు, పప్పు కలిపిన అన్నం డబ్బా ఆమెకిస్తూ, ఇన్నేళ్ల గడిపిన అవే ఆలోసిస్తే ఎట్టాగే అంటే తన తుండుగుడ్డతో ఆమె కళ్లు తుడిచినాడు. పక్కనే కూసున్న ఆమె, పెనిమిటితో ఇప్పుడున్నట్టే అప్పుడే కూడా ఉంటే బాగుండుకదయ్యా అంటూ తన కొడుకు సీనయ్య, బిడ్డ రేణమ్మ గురించి ఆలోచిస్తూ మళ్లీ ఏడిసింది. చంద్రమ్మ, బాల పీర్లది పాలమూరు జిల్లాలోని ఓ మాలమూరు గ్రామం. ఉన్న రెండు ఎకరాలు కరువుకీ బీడుబడింది. సేసేది లేక వారి పెళ్లైన పదేళ్లకు పుట్టిన పిల్లలని తోలుకొని హైదరాబాదు వెళ్లి అక్కడ అపార్ట్‌మెంట్లో కూలి పనికి సేరినారు. పిల్లలు సంటోళ్లు కావడంతో, పిల్లల్ని వాళ్ల గుడిసెలోనే వదిలి అపార్ట్‌మెంట్ పనికి ఇటుకలు మోసేవారు. సాయంకాలానికి భుజాలు, నడి నెత్తిపుండ్లు అయ్యేవి. ఎలాగైతేనేమి పిల్లల కడుపు మూడుపూటలా నిండుతుందని సర్దుకుపోయారు. అట్లాగే ఆరేడు నెలలు గడిపారు. ఓనాడు మధ్యాహ్నం రేణమ్మ, సీనయ్యకు బువ్వతినబెట్టి, పక్కనే ఉన్న ఇసుకలో ఆడి ఆడి అలసినాక గుడిసెలో పండుకున్నారు. లేసెసరికి తమ్ముడు గుడిసెలో లేదు. బిక్కుబిక్కుమంటూ కళ్లనిండా నీళ్లతో అంతా కలియ చూసింది. తమ్ముడు యాడ కనిపియ్యలే. కాసంత దూరంలో రోడ్డుమీద మంది గుమ్మి కూడడంతో అటు లగెతితంది రేణమ్మ. రోడ్డుమీద రక్తం మడుగులో తమ్ముని సూసేసరికి గుండె ఆగినంత పని అయింది ఆ పసిబిడ్డకి. గుండెని రాయి జేసుకొని ఆ గుండెలమీద పాణం బోయిన సీనయ్యని, అట్టా సూసి సగం పాణం బోయిన బిడ్డ, పెళ్లాన్ని తోలుకొని సెంతూరికి వచ్చాడు బాలపీరు.

కరువుకి కడుపు కాలినా, తన కొడుకుని కట్టెల మీద పండుకోబెట్టిన హైదరాబాదుకు మాత్రం పోవద్దంది చంద్రమ్మ. తప్పేది లేక ఊర్లోనే దొరికిన కూలి పనికిపోయే వారు చంద్రమ్మ బాలపీర్లు. వచ్చే కూలి పైసలు కూడు, గుడ్డకే అంతంత మాత్రం సరిపోయేవి. వాటితో ఉన్న ఒక్క బిడ్డకి సదువు చెప్పించలేక అప్పుడప్పుడు రేణిను కూడా వాళ్లతో కూలి పనికి తీసుకుపోయే టోళ్లు. తక్కువ కట్నం అడుగుతున్నారని, పిల్లోడు దూరపు సుట్టమేనని రేణికి పదనాలుగు ఏండ్లకే పెళ్లి చేశారు. సిన్న వయసు, శక్తిలేని శరీరం కావడంతో మూడుసార్లు గర్భం నిలబడలేదు ఆ పిల్లకి. నాలుగోతూరి కాన్పులో ఆ పిల్లకు ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని కట్టుకున్నోడి, అత్తారింటి వారి వేధింపులు పడలేక, ఆ పిల్ల కన్నోలని, కన్న బిడ్డను కాదనుకొని ప్రాణాలు తీసుకుంది. అటుగా ఉరికొస్తున్న రేణిబిడ్డని తన ఒళ్లో కూసోబెట్టుకుంటూ, ఆ దేవుడి పుణ్యమా అని కరువుబాయే. ఉన్న అప్పులు తీరిపాయే. ఆ పచ్చని పంట చూసుకుంటూ, బంగారంలా సదువుకుంటున్న నా మనవరాలిని సూసుకుంటూ అయినా ఈ నాలుగు మెతుకులు నవ్వుకుంటూ తినరాదే నా చంద్రమ్మ అంటూ, అన్నం ముద్ద ఆమె నోటికాడ పెట్టాడు బాలపీరు.

– నమ్రత

వార్త ఆదివారం

బాలగేయం

స్నేహ గీతం

నా మాటే తేనెల తేట
నా బాటే పువ్వుల తోట
నాపాటే కోయిల పాట
నా ఆటే మయూరి ఆట

నా వయసే వన్నెల హాసం
నా మనసే వెన్నెల మాసం
నా హృదయం నీలాకాశం
నా వదనం వసంత
మాసం
నా మమతే మానవత్వం
నా సమతేస్నేహగీతం
నా చూపే సుప్రభాతం
నా రూపే ప్రేమతత్వం

- గుండాల నరేంద్రబాబు

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

- ఎస్.మధులిక, మానకొండూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మేఘాలు ఎలా రూపొందుతాయి?

జవాబు: మధులికి! మేఘాలకు ప్రత్యేక రూపం ఉండదు. గాలిలో ఉండే అసంఖ్యాక నీటిబిందువులు, ఐస్ క్రిస్టల్స్ కలిసి ఏర్పడినవే. అంటే సూక్ష్మ బిందువుల రూపంలో గాలిలో చేరిన నీరు మనకు మేఘాల రూపంలో కనపడుతుంది. చల్లగాలి కంటే వేడిగాలిలోనే తేమ ఎక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రతా ప్రభావం వలన ఈ మేఘాలలోకి కొత్తగా నీటి బిందువులు వచ్చి చేరుతూనే ఉంటాయి.

మేఘాలలో ఆర్ద్రతా శాతం సంతృప్తికర స్థాయికి చేరగానే అవి వర్షిస్తాయి. ఆ పరిస్థితులలో మేఘాలలోని సూక్ష్మ బిందువులన్నీ కలిసిపోయి నీటి బిందువులుగా మారతాయి. భూమ్యాకర్షణ శక్తి వలన అవి భూమి మీద వర్ష రూపంలో పడతాయి. మేఘాలలో ఆర్ద్రతా శాతం తగినంత స్థాయిలో వున్నప్పుడు చల్లటి గాలి వీచినా వర్షం రూపంలో నీటి బిందువులన్నీ కలిసి భూమి మీదకు జాలువారుతాయి.

- బి.ప్రహ్లాద్, హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. జున్నుపాల విశిష్టత తెలుపగలరు?

జవాబు: ప్రహ్లాద్! గేదె ఈనిన తర్వాత మొదటి మూడు రోజుల వరకు జున్నుపాలు(కొలోస్ట్రం) స్రవిస్తాయి. దూడ పెరుగుదలకి సంబంధించిన అనేక పోషక పదార్థాలు ఈ జున్నుపాలలో ఉన్నాయి. ముఖ్యంగా దూడలకి కావలసిన వ్యాధి నిరోధకశక్తి ఈ పాల ద్వారానే లభిస్తుంది. సాధారణ పాలతో పోల్చి చూస్తే- ముర్రుపాలల్లో ఐరన్, కాపర్ అత్యధికంగా ఉంటాయి. కొవ్వు పదార్థం, ప్రొటీన్, లాక్టోజ్, విటమిన్ ఎ మొదలైనవి జున్నుపాలల్లో లభిస్తాయి.

సువాసనల అత్తరు

ఐ.ప్రసాదరావు

పెర్ఫ్యూమ్ అంటే తెలియని వారుండరు. ఎందుకంటే ఏదో సందర్భంలో ప్రతీఒక్కరూ అత్తరు, సువాసనలు వెదజల్లే పెర్ఫ్యూమ్, సెంట్లు, పన్నీరు వాడతారు. అసలు ఈ భారతీయ సువాసనలు చరిత్రను పరిశీలిస్తే ఎన్నెన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. పెర్ఫ్యూమ్ అంటే 'సెంట్స్ మిక్సిరో' అని తెలుస్తోంది. 'పెర్ఫ్యూమస్' అనేపదం లాటిన్‌పదం నుండి పెర్ఫ్యూమ్ వచ్చింది. అంటే పొగ ద్వారా (ఆవిరి ద్వారా) తయారు చేయబడిన ద్రవం, రోమన్స్, పర్షియన్లు, అరబ్ దేశస్తులు ఈ సెంట్లకు కాలక్రమేణా మరింత నాణ్యమైన, సువాసనలు వెదజల్లేవిధంగా తయారు చేసినట్లు తెలుస్తోంది. ఇక సింధూ నాగరికత కాలంలోనే సెంట్లు తయారు చేసేవారు అని సింధు నాగరికత త్రవ్వకాలలో బయటపడిన ఎర్రరాతి పాత్రలు ద్వారా తెలుస్తోంది అని ప్రముఖ ఆర్కియాలజిస్టు 1975లో 'పాలో రొవెస్టి' తెలిపారు. అంతేకాకుండా, 'విలయం డాత్రింపుల్ 'సెంట్స్ అండ్ సెన్సువిటీ' అనే సందేశంలో సింధూ నాగరికత కాలంలోనే సెంట్లు తయారు చేసేవారని తెలిపారు. 'ఇండియన్ హిస్టరీ ఆఫ్ పెర్ఫ్యూమ్' అనే అంశంపై 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్రియేటివ్ రీసెర్చ్‌థాట్స్' రిసెర్చ్ పేపర్ ప్రకారం భారతదేశానికి పెర్ఫ్యూమ్ కొత్తకాదని, అనాదిగా తయారు చేసి, వాడుతున్నారు అని తెలిపారు. పూర్వకాలంలో భారతదేశంలో పువ్వులు, బెరడలు, కాండాలు, సుగంధద్రవ్యాలతో పెర్ఫ్యూమ్ తయారు చేసిన అత్తర్లు, సెంట్లు సాధారణంగా మణికట్టు (రిస్ట్), మెడ, చెవులు వెనుకభాగంలో రాసుకునే వారు అని తెలుస్తోంది. ఇక హిందూ ఆయుర్వేద గ్రంథాలైన 'చరక సంహిత', శుశ్రుత సంహిత, రెండవ చంద్రగుప్తకాలంలో నవరత్నాలలో ఒకరైన వరాహమిహిరుడు రాసిన 'బృహత్ సంహితలో కూడా అత్తరు సువాసనలు ప్రస్తావన ఉంది.

'గంధకుటీ' పుస్తకంలో సువాసనలు వెదజల్లే విధంగా పెర్ఫ్యూమ్ వాడినట్లు తెలుస్తోంది. ఋగ్వేదంలో పూలదండలు, లిల్లీ పూల ప్రస్తావన ఉంది. సుగంధ, సువాసన స్రాలు విషయం ఉంది. అధర్వణవేదంలో 'పుణ్యగంధం' అనేపదాలు ప్రయోగించడం జరిగింది. లికోరైస్, కుష్ఠ, కమలం వంటి మొక్కల ప్రస్తావన ఉంది. హిందూ, జైన మత కార్యక్రమాల్లో సువాసనలు వెదజల్లే పెర్ఫ్యూమ్ ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి. బౌద్ధ సన్యాసులు పెర్ఫ్యూమ్ వాడకానికి దూరంగా ఉండాలి అనే నియమం ఉండేది.

పురాణాలలో కాస్మోలజి గురించి ఉంది. అగ్ని దేవునికి పూజల కార్యక్రమంలో సువాసనలు ప్రస్తావన ఉంది. వాల్మీకి రామాయణం, మహాభారతంలో కూడా అత్తర్లు, సెంట్లు వాడినట్లు తెలుస్తోంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న కౌటిల్యుడు రాసిన అర్థశాస్త్రంలో కూడా అగరువత్తులు, గంధం ప్రస్తావన ఉంది. దీనికితోడు యూకలిప్టస్ ఆయిల్ గురించి కూడా ప్రస్తావించారు. దీపాలు వెలిగించడానికి సుగంధ ద్రవ్యాలతో కూడిన ఆయిల్‌వాడినట్లు తెలుస్తోంది. వివిధ మతపరమైన కార్యక్రమాల్లో, పూజల్లో, వివిధ సంతోషకరమైన సమయంలో, పండుగలు, వివాహాలు, వేడుకలు సందర్భాల్లో అత్తరు, పన్నీరు, సువాసనలు వెదజల్లే పెర్ఫ్యూమ్ వాడినట్లు తెలుస్తోంది. నేడు కూడా మనదేశంలో ఎన్నో వేలరూపాయలు వెచ్చించి పెర్ఫ్యూమ్ కొంటున్న పరిస్థితి. యువత, వయస్సుతో నిమిత్తం లేకుండా పెద్దవారు అత్తర్లు, సెంట్లు, పెర్ఫ్యూమ్ వాడుతూ ఉన్నారు. కోట్ల రూపాయల ఖర్చు చేస్తున్నారు.

‘బ్యూటీ పార్లర్‌కు, పెర్ఫ్యూమ్‌కు చేస్తున్న వ్యయం అంచనాలకు అందడం లేదు అంటే అతిశయోక్తి కాదు. ఆయుర్వేద వైద్యశాస్త్రంలో కూడా దేశంలో వివిధ ప్రాంతాల్లో లభించే స్థానిక పువ్వులు యొరడలు కాండాలు, చెట్టు ఆకుల నుంచి అత్తర్లు సెంట్లు తయారు చేసేవారు అని తెలుపుతుంది. మొఘలులు దేశంలో పాలించే సమయంలో మరెన్నో పెర్ఫ్యూమ్, మంచి సువాసన కలిగిన అత్తర్లు దేశంలో ప్రవేశించాయి. మధ్యఆసియా, సౌత్‌ఈస్ట్ దేశాలతో ఆరోజుల్లోనే పెర్ఫ్యూమ్ వ్యాపారం విరివిగా జరిగేది. మంచి సాంస్కృతిక సంబంధాలు బలపడటానికి దోహదం చేసాయి. అత్తరు రాసుకోవడం, వాడటం అనేది వ్యక్తిగత స్టేటస్ చిహ్నంగా

భావించేవారు.

ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని ‘కనోజ్’ ఆరోజుల్లోనే పెర్ఫ్యూమ్ కాపిటల్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచింది. ముఖ్యంగా ఇక్కడ తయారైన రోజ్, జాస్మిన్, శాండిల్‌వుడ్, అగర్‌వుడ్‌తో తయారైన అత్తర్లు దేశంలోనే కాకుండా, ప్రపంచంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని కసౌలి, గుజరాత్‌లోని భావనగర్ (రోజ్‌అత్తర్లు), ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ వివిధ అత్తర్లకు ప్రసిద్ధి చెందాయి. నేటికీ ప్రపంచవ్యాప్తంగా మంచి గిరాకీ సువాసనలు వెదజల్లుతున్నాయి. ఇక దక్షిణ భారతదేశంలోని కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు శాండిల్‌వుడ్

అత్తర్లకు ప్రసిద్ధి చెందింది. జాస్మిన్ అత్తర్లకు తమిళనాడులోని మధుర, వివిధ పరిమళాలు వెదజల్లే వాటితో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ అత్తర్లు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి అనేకరకాలైన అత్తర్లు, సెంట్లు, పెర్ఫ్యూమ్ తయారు అవుతున్నాయి. భారతీయుల జీవితంలో ముఖ్యమైన భాగంగా మారాయి. అదే సమయంలో వివిధ దేశాలకు అత్తర్ల సెంట్లు పెర్ఫ్యూమ్ ఎగుమతి చేయడం ద్వారా అనేక కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. భారతీయ జీవితంలో మతపరమైన కార్యక్రమాల్లో, పూజా సమయంలో, వినోదం, వివాహాలు పుట్టినరోజు సందర్భంగా వివిధ వేడుకల్ల అత్తర్లు సెంట్లు పెర్ఫ్యూమ్ వాడుతూ పరిమళభరితమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా చిన్నపిల్లల నుండి పండు ముదుసలి వరకూ వ్యక్తిగతంగా అత్తర్లు సెంట్లు పెర్ఫ్యూమ్ వాడుతూ ఆనందాన్ని పొందుతూ, ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవితాన్ని గడుపుతున్నారు.

‘మాయ’శ్చరైజర్..

(15వ పేజీ తరువాయి)

కాబట్టి అలాంటి పదార్థాలు కలిగినటువంటి మాయిశ్చరైజింగ్ క్రీములను కొనేముందు వాటిని గమనించి తీసుకోవాలి. షియాబట్టర్ చాలామందంగా బలమైన హైడ్రేట్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఎంతటి రఫ్‌గా ఉన్న చర్మం గలవారైనా సరే వెన్న తగలగానే సున్నితంగా, మృదువుగా మారి చర్మంలోని చొచ్చుకొనిపోయి చర్మాన్ని శుభ్రపరిచి కాంతివంతంగా చేయడంలో చాలా అద్భుతంగా పనిచేస్తుంది. పొడి, సాధారణ చర్మతత్వం ఉన్నవారు విటమిన్ సి. వెన్న వంటి రకాలను ఎంచుకోవాలి. దీనివల్ల చర్మం ఎక్కువసేపు తాజాగా ఉంటుంది. మృదువుగానూ మారుతుంది. సున్నితమైన చర్మతత్వం ఉన్నవారు. పీహెచ్‌స్థాయి తక్కువగా, పరిమళంలేని, మాయిశ్చరైజింగ్ గుణం ఉన్న లోషన్‌ను ఎంచుకోవాలి.

సాధారణంగా మాయిశ్చరైజర్స్ అనేవి సహజంగా లేదా కృత్రిమంగా ఉంటాయి. వీటిని రసాయనాల చర్యల భయం లేకుండా ఉపయోగించడానికి వీలుగా ఇంట్లోనే తయారు చేసుకోవడం ఉత్తమం. ఇంట్లో తయారు చేసిన మాయిశ్చరైజర్స్ చవకగా, ఆరోగ్యకరమైన ఎంపికగా ఉంటాయి. కమర్షియల్ మాయిశ్చరైజర్స్ ఖరీదు ఎక్కువగా ఉంటుంది. ఈ వాణిజ్య మాయిశ్చరైజర్స్‌లలో వివిధ పెట్రోలియం ఉత్పత్తుల వంటి హానికరమైన రసాయనాలు చాలా ఉంటాయి.

కథ

బాగుందే!

మాలా కుమార్

"మనసెరిగి మసలుకునేవాళ్లే మనవాళ్లు" అప్పటికి లక్షా తొంభై సార్లు... కాదు.. కాదు కోటీ తొంభై సార్లు... ఇంకా చెప్పాలంటే లెక్కలేనన్ని సార్లు అనుకున్నాడు రంగారావు. కళ్లల్లో నుంచి నీళ్లు బయటకు వస్తాం.. అని మారాం చేస్తున్నాయి. గొంతు గురగురా అంటోంది.

ఛీ... తన బతుకెంత అధ్వాన్నం అయిపోయింది? తనేమన్నా చిన్నా చితకావాడా? ఆకుపచ్చ సంతకాలు చేసిన గెజిటెడ్ ఆఫీసర్! ఇప్పుడు చప్రాసీ అయిపోయాడు. ఇంతకన్నా అవమానం ఇంకేముంటుంది? గత కొన్ని నెలలుగా జరిగినదానికన్నా ఈరోజు జరిగింది గుండెను మండిస్తోంది. రిటైర్ అయితే జీవితం ఇంతలా మారిపోతుందా?

ఆ రోజు.. తన రిటైర్మెంటు రోజున- తననూ, కాంతంను కూర్చోబెట్టి ఘన సన్మానం చేసారు. సహోద్యోగులందరూ తన గురించి ఎంతో గొప్పగా మాట్లాడారు. పెద్ద పెద్ద పూలదండలు వేసారు. శాలువా కప్పారు. అబ్బో! ఆ ఫంక్షన్ తలుచుకుంటేనే ఒళ్లు ఉప్పొంగుతుంది. తనకు ఇష్టమైన పదార్థాలతో విందు ఇచ్చారు. ఇంటికొచ్చాక ఎవరికీ జరగనంత గొప్పగా తన రిటైర్మెంటు పార్టీ జరిగిందని తలచుకొని మురిసిపోతుంటే-

"ఆ.. హమ్మయ్య! మనకు వీడి బాధ తప్పింది.. అని అంత పెద్ద పార్టీ ఇచ్చారేమోలే" అని తీసిపారేసింది కాంతం.

"చుప్పనాతి శూర్పణఖ పోనీలే.." అని ఊరుకున్నాడు.

మరునాడు రోజులాగే పొద్దున్నే మెలుకువ వచ్చింది. "ఆ... అప్పుడే లేచి చేసేదేముంది?" అని కాసేపు అలాగే మంచం మీద అటూ ఇటూ దొర్లి, ఇక ఎక్కువసేపు దొర్లలేక లేచాడు.

కాంతం ఇచ్చిన కాఫీ తాగి, అప్పుడే వచ్చిన పేపరు చదివాడు. స్నానం అయ్యాక దండం పెట్టుకోవడమే కానీ రోజువారీ జపాలు, పూజ ఎప్పుడూ అలవాటు లేదు. కాసేపు వరండాలో అటూ ఇటూ పచార్లు చేసి టిఫిన్ తిన్నాక ఇంకేం చేయాలబ్బా!? అని ఆలోచించీ.. ఆలోచించీ కేబుల్‌వాడికి అప్పనంగా బోలెడంత డబ్బు పోస్తున్నాం, ఇప్పటిదాకా ఎప్పుడూ చూడలేదు, ఇక చూద్దాం అని టీవీ పెట్టాడు.

ఎన్ని ఛానల్స్! ఎన్ని ప్రోగ్రాంలో! రోజంతా... రోజంతా ఏమిటీ? రాత్రిదాకా ఛానల్స్ తిప్పీ తిప్పీ వార్తలు, టీవీ వార్తలు, అత్తా కోడళ్ల సీరియళ్లు, హబ్బో! అన్నీ చూసీ చూసీ... అలవాటు లేని పని కావటంతో కళ్లూ, వేళ్లూ నొప్పులు పుట్టాక టీవీ ఆఫ్ చేసి పడుకున్నాడు.

అరే! ఇదేదో బాగుందే!! అందుకే అందరూ టీవీకి అతుక్కుపోతారు.. అని ఓ ప్రోగ్రాంకి ఫిక్సైపోయాడు. తినడం, టీవీ చూడటం, మధ్యాహ్నం కాసేపు రెస్ట్ తీసుకొని- చాయ్, స్నాక్స్‌తో సహా టీవీ ముందే సెటిల్డ్!

ఇలా కొన్ని నెలలు గడిచాయి.

సడన్‌గా కాంతానికి ఏమయిందో ఏమో.. ఓరోజు "ఊరికే మిడిగుడ్లేసుకొని టీవీ ముందు కూర్చోకపోతే మార్కెట్‌దాకా వెళ్లి కూరలు తేవచ్చుగా" అని సంచీ విసురుగా ఒళ్లో వేసింది.

కాంతం సణుగుడు భరించలేక కూరలు తెచ్చి ఇచ్చాడు.

సాయంకాలం వచ్చినప్పుడు ఏవో స్వీట్స్ ప్యాకెట్స్ తెస్తే "అవేమిటీ నాకివ్వరా?" అని కొడుకును అడుగుతున్నా వినిపించుకోకుండా కోడలు అంజలి కొంగుచాటుగా పెట్టుకొని తన గదిలోకి తీసుకెళ్లింది.

ఇదేమిటీ? ఎప్పుడూ లేని అలవాటు అనుకొని ఆశ్చర్యపోతూ "కాంతం! ఇదేమిటే? అడుగుతున్నా పెట్టకుండా తీసుకుపోయింది?" రాత్రి భోజనానికి పిలిచిన కాంతంను అడిగాడు.

"అన్నీ ఆరాలూ కావాలి. అయినా ఇప్పుడు నీ తిండికేమి లోటు వచ్చింది?" విసుక్కుంటూ కంచంలో రెండు పుల్కాలు, పక్కన ప్లేట్‌లో ఏవో కూరగాయ ముక్కలు, గ్లాస్‌లో మజ్జిగ పెట్టింది.

"ఈ రొట్టెముక్కలు, పచ్చికూరగాయ ముక్కలు, మజ్జిగ ఏమిటే? నేనెప్పుడైనా తిన్నానా? ఎన్నడైనా పెరుగు తప్ప మజ్జిగ పోసుకున్నానా?" కోపంగా అరిచాడు.

కాంతం వినిపించుకోకుండా మనవడికి తినిపించడంలో ఉండిపోయింది.

అది మొదలు తన తిండి కనాకష్టం అయిపోయింది. స్వీట్స్ తనకు పెట్టకుండా దాచుకొని తినటం, తనకిష్టమైన పూరీలు అవీ కూడా తన ముందే తనకు పెట్టకుండా మనవడికి



పెట్టటం... ఇలా బోలెడు మార్పులు తన తిండిలో. అప్పటికీ ఉక్రోశం ఆపుకోలేక "నేనేమైనా పశువునా? ఈ గడ్డిగాదం తినటానికి?" అని అరిచినా పట్టించుకున్నవాళ్లే లేరు.

సాత్వికులైన కొడుకూ, కోడలు మారిపోయారు.

"నా కొడుకు అమాయకుడమ్మా, వాడికి కాస్త తిండిపుష్టి ఉన్నదని వాడి మనసెరిగి కావలసినవి చేసిపెడుతూ, కాస్త కనిపెట్టుకొని ఉంటావని నీ చేతిలో పెడుతున్నానే కోడలుపిల్లా" అని–

అమ్మ మేనకోడలికి తనను అప్పగించినప్పటి నుంచీ ఏదో అప్పుడప్పుడు అరవటం తప్ప ముద్దుగా చూసుకుంటున్న కాంతం సూర్యకాంతం పేరును సార్థకం చేసుకుంటూ ముందే కాస్త గట్టిదేమో ఇప్పుడు మరీ గంపగయ్యాళమ్మ అయిపోయి కొడుకుకు, కోడలికి వంత పాడుతోంది.

పైగా "ఎద్దులా కూర్చున్నావు. కాస్త మనవడిని పార్క్‌కు తీసుకెళ్లి ఆడించవచ్చుగా" అని కూడా కసురుకుంటోంది మొగుడన్న మర్యాద లేకుండా! అందుకే మావకూతురిని పెళ్లి చేసుకోకూడదు. ఇట్లాగే నెత్తినెక్కుతారు. ఇప్పుడనుకొని ఏమి లాభం?

అంతటితో తన కష్టాలు ఆగలేదు, "ఎప్పుడూ ఆ టీవీ ముందు కూర్చొని అత్తాకోడళ్ల సీరియళ్ల చూడకపోతే చెట్లకు నీళ్ల పోసి, తోట పని చూసుకోవచ్చుగా! రెండు రోజుల నుంచి మాలి రావటం లేదు. పెరట్లో కూరగాయల మడులు, పూలమొక్కలూ ఎండిపోతున్నాయి. ఏదీ పట్టదు.. దిష్టిబొమ్మలా హాల్ మధ్యలో కూర్చున్నావు" అని చిరాకు పడ్డాడు రామం.

అట్లా ఒక్కొక్క పని తనకు అప్పగించారు. పకోడీల వాసన వస్తుంటే హాబ్బా! తనకిష్టమైన పకోడీలూ.. హూ.. అని వంటింట్లోకి వెళ్లాడు. మీకిక్కడేమి పని? బయటకెళ్లండి అని తరిమింది అంజలి. అంతే..! తనకు పౌరుషం వచ్చేసింది.

"రామం!" అని భీకరంగా అరిచాడు.

ఆ అరుపుకు అదురు బెదురు లేకుండా గదిలో నుంచి బయటకు వచ్చి "ఏమిటీ?" అడిగాడు తాపీగా.

"ఆ మధ్య నా బ్యాంక్ పాస్ బుక్ తీసుకున్నావు, అది ఇటివ్వు. ముద్దకుదుముల్లా నా పెన్షన్ బోలెడు మీ చేతుల్లో పోస్తుంటే నాకు తిండి పెట్టకుండా గొడ్డుచాకిరీ చేయిస్తూ హీనంగా చూస్తున్నారు. ఇక ఊరుకునేది లేదు. నా కన్నా ముందే మీ అమ్మ డబ్బులు తెచ్చేసుకుంటోంది. నా చేతికి చిల్లిగవ్వకూడా దక్కకుండా చేస్తోంది. నా ఎకౌంట్ మీ అమ్మతో జాయింట్ కాకుండా నా పేరు మీదకే మార్చేసుకుంటాను. నాకు కావలసినవి తెచ్చుకుంటాను. హోటల్‌కు వెళ్లి తింటాను. అప్పుడు కుదురుతుంది మీ తిక్క. నువ్వు పాస్‌బుక్ ఇవ్వకపోయినా బ్యాంకుకు వెళ్లి మార్చుకోగలను, ఏమనుకుంటున్నారో ఖబడ్దార్" ఆయాసపడిపోయి ఖళ్..ఖళ్‌మని కాస్త దగ్గాడు కూడా!

"ఓయబ్బో! మహా వచ్చాడండీ. నువ్వు ఆ పని చేస్తే ఇదో ఈ ఫ్యాన్‌కు ఉరేసుకొని చస్తా... దయ్యమై నిన్ను పీడిస్తా" కళ్ల పెద్దగా చేసి, చేతులు తిప్పుతూ అంది కాంతమ్మ.

ఒక్క క్షణం బిత్తరపోయి, ఇక ఏమీ మాట్లాడలేక విసురుగా బయటకు వచ్చి మొక్కల్లో గడ్డిని పీకుతూ కూర్చున్నాడు.

పక్కింటి ఛాయమ్మ ఎందుకో బయటకు వచ్చి తనను చూసి "ఇదేంటన్నయ్యగారూ, వేళకాని వేళ గడ్డి పీకుతున్నారు? చాయ్ తాగారా?" అడిగింది.

ఆప్తురాలు దొరికినట్లుగా తన ఘోషను వెళ్లబోసుకుంటుంటే– "ఏమిటోనండీ! ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్లు" అని సానుభూతిని చూపిస్తున్న ఛాయమ్మ భర్త రమణారావు

"ఎద్దులా కూర్చున్నావు. కాస్త మనవడిని పార్క్‌కు తీసుకెళ్లి ఆడించవచ్చుగా" అని కసురుకుంటోంది కాంతం మొగుడన్న మర్యాద లేకుండా! అందుకే మావ కూతురిని పెళ్లి చేసుకోకూడదు. ఇట్లాగే నెత్తినెక్కుతారు. ఇప్పుడనుకొని ఏమి లాభం?

వచ్చి–

"నీకెందుకు? నువ్వు లోపలికి రా" అని గడకర్రలా గాలికి ఊగిపోతూ పిలుస్తూనే ఉన్నాడు, ఛాయమ్మను.

లోపలి నుంచి కాంతమ్మ వచ్చింది. "బజార్లో పక్కింటోళ్లతో పంచాయితీ పెట్టిస్తున్నావా? దేభ్యమొహం వేసుకొని ఆడోళ్లతో నీకేమిటి మాటలు? ఏందమ్మా ఛాయమ్మా! నా కాపురంలో నిప్పులు పోస్తావా?" అని అంటే ఛాయమ్మ ఊరుకుంటుందా?

ఇద్దరూ చేతులు తిప్పుకుంటూ పెద్ద గొంతులేసుకొని అరుచుకుంటుంటే తను ఆ గంపమ్మ కథ చూడలేక ఇదో ఇట్లా వచ్చి, పార్క్‌లో వేపచెట్టు కింద బెంచీ మీద కూలబడ్డాడు.

అవును.. ఏ రచయిత అన్నాడో కానీ "మనసెరిగి మసలుకునేవాళ్లే మనవాళ్లు" వీళ్లెవరూ నా వాళ్లు కాదు అని మళ్లీ లెక్కపెట్టలేనన్ని సార్లు అనేసుకొని, పరిపరి విధాల చింతిస్తూ, దుఃఖిస్తున్న రంగారావు నెత్తిన టప్‌మని ఓ వేపకాయ, ఆ వెనువెంటనే ఓ వేప రెమ్మ వచ్చి నెత్తిన పడ్డాయి.

అవి చూడగానే అప్పుడే కాంతం గంపమ్మ ఉరేసుకున్నట్లూ, దయ్యమై తనను గట్టిగా పట్టేసుకొని కంగాళీ నృత్యం తనతో చేయిస్తున్నట్లూ, మంత్రాల మాంచారయ్య వచ్చి వేపకొమ్మలతో కసాబిసా బాదేస్తున్నట్లు, గంపమ్మ వికటాట్టహాసం చేస్తున్నట్లు ఊహ వచ్చేసి వణికిపోయాడు రంగారావు.

రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

అంతలోనే తెలివి తెచ్చుకొని చుట్టూ చూసాడు. పార్క్‌లో అందరూ వెళ్లిపోయారు. ఆడుకుంటున్న మనవడు కూడా లేడు. వెధవ నాకు చెప్పకుండానే వెళ్లిపోయాడా? ఇహ ఇప్పుడేమి గోల ఉందో కొంపలో.. అని నిట్టూరుస్తూ.. అయినా నేనెందుకు వీళ్లకు భయపడాలి? అసలు ఆ చావేదో నేనే చచ్చి వీళ్లను పీడిస్తే!

మంత్రాల మాంచారయ్య వీళ్లను చితకబాదాలి. తను భీకరంగా నవ్వాలి. దారిలో పడ్డ వేపకాయను నలుస్తూ కాసేపు ఏ విధంగా చస్తే బాధ లేకుండా చావొచ్చు? అని ఆలోచించాడు. ఆ ఆలోచనలతోనే కాళ్లీడ్చుకుంటూ ఇంటికి చేరాడు.

“ఇంతసేపటివరకు ఎక్కడికెళ్లావు?” గయ్‌మంది కాంతమ్మ.

కాంతమ్మను నిర్లిప్తంగా చూసి, లోపలి నుంచి నిద్రమాత్రల సీసా తెచ్చి చూపిస్తూ “నేనింక నీ కడవళ్ల భరించలేను. ఈ మాత్రలు మింగి చస్తాను” అని చేతిలోకి సీసా వంపుకొని, మంచినీళ్ల కోసం డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్లాడు.

అక్కడ మనవడు, కొడుకు కూర్చొని ఉన్నారు. టేబుల్ మీద పొగలు చిమ్ముతూ అన్నం, ముక్కుపుటాలను అదిరిస్తూ ఘాటుఘాటుగా కొత్త ఆవకాయ, కొద్ది దూరంలో చెరుకు రసాలు కనిపించి నోరూరించాయి. అవి తిని చద్దామా? అని ఒక్క క్షణం ఆలోచించాడు. తన పిచ్చిగానీ.. ఈ రాక్షసులు తనను తిననిస్తారా? విరక్తిగా అనుకొని వాటివైపు చూడకుండా మనసును అదుపు చేసుకుంటూ, కళ్లు మూసుకొని నీళ్ల గ్లాస్ అందుకున్నాడు.

“బావండీ...”

“డాడీ....”

“మామయ్యగారూ...”

“తాతయ్యా...”

అందరూ గగ్గోలుగా అరిచారు.

పక్కింటి నుంచి రమణారావు, ఛాయమ్మ పరిగెట్టుకుంటూ వచ్చారు. రమణారావు, రంగారావు చేతిలో నుంచి మాత్రలు గుంజుకొని “ఏం పనిది?” మందలింపుగా అన్నాడు.

“మీకు తెలియదు.. వీళ్లు నాకు తిండి పెట్టకుండా ఎంత హింస పెడుతున్నారో, నాతో ఎంత చాకిరీ చేయిస్తున్నారో” అన్నాడు ఉక్రోషంగా.

“బావండీ! నన్ను క్షమించు... బావా నన్ను క్షమించు” రంగారావు చేతులు పట్టుకొని బాధగా అంది కాంతం.

దీని దుంపతెగ.. ఇప్పుడు కాళ్లూ కాకుండా చేతులు పట్టుకుంది సొంత గీర” మనసులో అనుకొని “క్షమించను పో” అన్నాడు రంగారావు మరింత గీరగా.

“నాన్నా అది కాదు, అసలు సంగతేమిటంటే అయిదు నెలల క్రితం నువ్వు టీవీ చూస్తుండగా ఏమి జరిగిందో గుర్తు తెచ్చుకో” అన్నాడు.

రింగులు తిప్పాడు రంగారావు.

“ఆ... ఇప్పుడు రింగులు తిప్పి అంత అవస్థ ఎందుకుగానీ, బావండీ.. ఆరోజు నువ్వు కళ్లు తిరిగి పడిపోయావు. అట్లా రెండు సార్లు జరిగేసరికి నిన్ను రామం డాక్టర్‌కు చూపించాడు. అన్ని టెస్టులూ చేసి నీకు బీపీ బాగా పెరిగిందనీ, షుగర్ బార్డర్‌లోకి వచ్చిందనీ, బరువు విపరీతంగా పెరిగావు, బరువు తగ్గాలనీ జాగ్రత్త పడాలనీ చెప్పాడు గుర్తుందా? కుర్చీలో నుంచి లేవటానికీ, నడవటానికీ ఇబ్బంది పడ్డావు. పైగా ఆ శంఖుమార్కు లుంగీలు వదలవు. గడ్డం చేసుకోమన్నా చిరాకు పడిపోతూ ఎంతసేపటికీ టీవీ ముందు నుంచి లేవవు. అక్కడికే రకరకాల రుచులతో స్నాక్స్ కావాలి. ఎంత చెప్పినా నీకు తిండియావ తగ్గదు”.

“వాకింగ్‌కు వెళ్లమంటే వెళ్లవు”

“అమ్మాయ్! అంజలీ... నువ్వు, మీ అత్తయ్యా ఓసారి ఈ సీరియల్ లాగా పోట్లాడుకోండి.. అని సరదా పడిపోయారు”

ఇలా..ఒకళ్ల తరువాత ఒకరు చెప్పుకుంటూ పోయారు.

“భారీ ఏనుగులా ఒళ్లు పెంచేసావు. తాతయ్యకు బీపీ ఎక్కువై పక్షవాతం వచ్చి ఎన్నాళ్లో మంచాన పడి తీసుకొని పోయాడు. బామ్మా, తాతయ్య షుగర్ ఎక్కువై గుండెపోటుతో పోయారు. నీకు ఆ పరిస్థితి రాకూడదని ఎంతో ఆలోచించి ఈ ప్లాన్ వేసాం. ఇప్పుడు చూడు.. నువ్వు గున్న ఏనుగులాగా కాదు, బుజ్జి ఏనుగు సైజుకు వచ్చావు. నీ కోసమే డాడీ ఇదంతా.. నీకోసమే..!” బాధగా పిడికిలి నోటికి సుతారంగా ఆనించుకొని, మొహం బాధగా పెట్టి అన్నాడు రామారావ్.

“అవును మామయ్యగారూ, అట్లా మాట్లాడినప్పుడల్లా ఎంత బాధ పడ్డామో తెలుసా?” చేతులు నలుపుకుంటూ, కళ్లు కొంగుతో తుడుచుకుంటూ అంది అంజలి.

“బావండీ, నిన్ను చూసినప్పుడల్లా ‘మాయాబజార్’లోని ఘటోత్కచునిలా కనిపించి ఎంత దడుచుకునేదాన్నో తెలుసా? ఉమ్మడి కుటుంబంలో యమధర్మరాజులాగా దున్నపోతెక్కి యముండ అని భీకరంగా అరుస్తూ యమధర్మరాజు వస్తుంటే నిన్ను



కాపాడాలని ఆ సావిత్రిలా నీతో ఈ నిరాహార దీక్ష సొంత నిష్ఠతో చేయించాను” అంటూ కాంతం కొంగు నోట్లో కుక్కుకుంటూ ఆపసోపాలు పడుతోంది.

“ఇదా సంగతి?” అని రమణారావు, ఛాయాదేవి నోరెళ్లబెట్టి చూస్తున్నారు.

శుభం కార్డు పట్టుకొని తన చుట్టూ నిలుచున్న అందరి మొహాలు ఒకటొకటిగా స్లో మోషన్‌లో చూసాడు. చిన్నగా నడిచి డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచాడు.

“అమ్మాయ్! ఆ రెండు చెరుకు రసాలు ఇటందుకో” అంటూ కంచం దగ్గరికి జరుపుకున్నాడు. వేడి అన్నం, ఆవకాయ కంచంలో తోడుకున్నాడు. తెల్లగా మెరిసిపోతున్న వెన్నముద్దను తీసుకొని మొత్తం వేసేసుకున్నాడు.

అన్నం కలిపాడు. గుండ్రాయంత ముద్దను చేసి, ఆబగా నోటి దగ్గరగా తెస్తుంటే–

“బావండీ..”

“డాడీ..”

“మామయ్యగారూ...”

“తాతయ్యా...”

“రంగారావ్...”

“అన్నయ్యగారూ...”

ఆ ఆర్తనాదాలు పట్టించుకోకుండా చేతిలోని ఆవకాయముద్దను మురిపెంగా చూసి, గట్టిగా వాసన పీల్చి, ఆ ఘాటుకు ముక్కు, కళ్లు ధారలు కారుతుండగా అందరివంకా చిద్విలాసంగా చూసి, నోట్లో కూరుతూ, ఆహా ఇది కదా “స్వర్గం అంటే” తన్మయంగా అన్నాడు.

భరద్వాజుని 'ఐతరేయం'

డా॥ టి.గౌరీశంకర్

తెలుగు సాహితీ లోకానికి మూడవ జ్ఞానపీఠాన్ని అందించిన డా॥ రావూరి భరద్వాజ 1927 జులై 5వ తేదీన జన్మించారు. అప్పటి నిజాం సంస్థానంలోని పరిటాల జాగీరులో ఉన్న మోగులూరు అనే గ్రామంలో పుట్టిన ఇతని తల్లిదండ్రులు కోటయ్య, మల్లికాంబ. తండ్రి జాతీయోద్యమం, సంఘ సంస్కరణోద్యమాలలో తరచుగా పాల్గొనేవాడు. ఈ కారణంగా ఇల్లు గడవకపోవడంచేత ఉన్న కొద్దిపాటి పొలం పోగొట్టుకొని నిరుపేదలయ్యారు. దానితో భరద్వాజ బాల్యం దారిద్ర్యంలోకి నెట్టివేయబడింది.

గుంటూరులోని తాడికొండలో అక్షరాలు దిద్దుకున్న భరద్వాజకు పై చదువులు చదవాలని ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోవడం వల్ల ఆయన చదువు ఏడవ తరగతి దగ్గరే ఆగిపోయింది. దానితో రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలలో తిరుగుతూ, ప్రజానాట్యమండలి వంటి సంస్థల కార్యకలాపాలలో విరివిగా పాల్గొనడం తండ్రిని మనస్థాపానికి గురి చేసింది. చివరికి తండ్రి భరద్వాజను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. ఆత్మాభిమానం దెబ్బతిన్న భరద్వాజ ఊళ్లో అక్కడక్కడా తిరుగుతూ ఏవో చిన్న చిన్న పనులు చేసుకుంటూ రోజులు గడిపేవాడు. ఒకనాడు తాను పనిచేసే చోట ఒక పెద్దాయన తన మనవడు 'మనుచరిత్ర'లోని పద్యాన్ని అప్పచెపితే ఆ కుర్రవాడిని మెచ్చుకుంటూ, తనను తక్కువ చేసి మాట్లాడటంతో భరద్వాజ నొచ్చుకున్నాడు. అప్పుడే పట్టుదలతో ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని గట్టిగా అధ్యయనం చేసి పద్యాలు రాసే దశకు చేరుకున్నాడు.

1943లో మిలటరీలో చేరి 1945లో యుద్ధం ముగియడంతో బయటకు వచ్చేశాడు. 1946లో నెల్లూరు వెళ్లి అక్కడ 'జమీన్ రైతు' పత్రికలో పనికి చేరాడు. కథలు రాయడం మొదలు పెట్టాడు. అవి అచ్చు అవుతూ వచ్చాయి. చలం సాహిత్యాన్ని ఇష్టంతో చదువుతూ తనదైన వచన రచనా శైలిని మెరుగు పర్చుకున్నాడు. 1948 జూన్‌లో మేదూరి మల్లయ్య రెండవ కుమార్తె కాంతంతో భరద్వాజ వివాహం జరిగింది. 1949లో తెనాలి చేరుకుని అక్కడ ఆలపాటి రవీంద్రనాథ్ నడిపే 'జ్యోతి', 'రేరాణి', 'సినిమా' పత్రికలలో పనిచేశాడు. ఆ రోజుల్లోనే పట్టుదలతో ఇంగ్లీషు నేర్చుకున్నాడు.

1956లో మద్రాసు వెళ్లి అక్కడి తెలుగు పత్రికలలో పని చేస్తూనే రచనా వ్యాసంగం కొనసాగిస్తూ రకరకాల వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నాడు. ఒకటి, రెండు సినిమాలకు కథలు రాశాడు. ఆ అనుభవమే తనను 1965లో 'పాకుడు రాళ్ళు' నవల

రాయడానికి ప్రేరణనిచ్చింది. దానికే 2012లో 'జ్ఞానపీఠ' పురస్కారం లభించింది. 1959లో ఆకాశవాణిలో ఉద్యోగం లభించాక ఆయన జీవితంలో ఒక స్థిరత్వం ఏర్పడింది.

భరద్వాజ మొదట పద్యాలు రాసినా, ఆ తరువాత కొంత కాలం వచన కవితలు రాశారు. బాలసాహిత్యాన్ని సృష్టించారు. సైన్స్ ఫిక్షన్ రచించారు. పత్రికా రచయితగా, సినిమా రచయితగా పనిచేశారు. ఇవన్నీ తొలినాళ్లలో అయినప్పటికీ ఆయన కథకునిగా, నవలాకారునిగానే లబ్ధ ప్రతిష్ఠులయ్యారు. కథనంలో నూతన ప్రయోగాలతో శిల్పంలో నవ్యతను సాధించారు. దారిద్ర్యంలోని దుర్భరతను, దగాపడిన జీవితాన్ని, బతుకులోని చేదును, ధనమదాంధుల అహంకారాన్ని, నీతి నిజాయితీ కొరవడిన అధికారాన్ని.. వీటన్నింటిని చవిచూశారు. వాటినే తన రచనలలో ప్రతిఫలింపజేశారు. బడుగుజీవుల వెతలను కతలను కథలుగా మలచడం వల్లనే భరద్వాజ రచనలలో జీవలక్షణం తొణికిసలాడుతుంది, వాస్తవికత తేటతెల్లమవుతుంది.

భరద్వాజ జీవితమనే కలం కలిమిలేముల కొలిమిలో కాలి, ఆటుపోటుల సమ్మెట పోట్లకు సాగబడుతు, సానబడుతు, నిప్పు రవ్వలు చిమ్ముతు తన అర్ధాంగి కాంతమ్మ అర్ధాంతరంగా అంతర్ధానం కావడంతో అది బంగారు కాంతులీనింది! రచయితగా ఆయన జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. తెలుగులో 'స్మృతి సాహిత్యం' కొత్తదేమీ కాదు. కానీ భరద్వాజ తన భార్య కాంతమ్మ జ్ఞాపకాలతో ప్రతి యేటా వెలువరించిన గ్రంథ పరంపరలో ఐదు రచనలు వచ్చాయి. 1) 'అంతరంగిణి', 2) 'ఐనా ఒక ఏకాంతం', 3) 'ఐతరేయం', 4) 'ఒకింత ఏకాంతం', 5) 'నాలోని నీవు'. ఇది 'స్మృతి సాహిత్యం'లో ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. ఒక నూతన కోణాన్ని ఆవిష్కరించింది. దాదాపు ప్రతిరోజు ఆయన ఆమె గురించిన జ్ఞాపకాలను, అనుభవాలను ప్రోది చేసుకొని పుస్తకంగా రాసుకొని వీటిని ఏటా వెలువరిస్తూ వచ్చారు.

ఈ వరుసలోని మూడవ గ్రంథం 'ఐతరేయం'లో చెప్పిన అనుభవాలు స్వీయమైనవే కావు సార్వత్రికమైనవిగా కనిపిస్తాయి. ఆ జ్ఞాపకాలు వైయక్తికమైనవే కావు, సార్వజనీనమైనవిగా అనిపిస్తాయి. పదాలకు ఒదగని ఒక అనంతమైన అంతర్మథనం ఆయనది. అంతరంగంలో రంగరించుకొన్న అనుభవాల రంగులతో

భరద్వాజ చాలాచోట్ల భవభూతి 'ఉత్తర రామాచరితమ్'లోని అంశాలను తరచు పేర్కొంటూ ఉంటారు. సీతారాముల ఉదాత్త ప్రణయాన్ని తమకు అన్వయింపజేసుకొంటారు. అయితే తాను మాత్రం రాముణ్ణని ఎక్కడా చెప్పుకోకుండా కాంతమ్మకు మాత్రం సీతమ్మ పీట వేసి గౌరవిస్తారు.

పంచభూతాలనే కుంచెలుగా మలిచి ప్రపంచమనే కాన్వాసుపై ప్రకృతి కాంతనే సరికొత్తగా ఆవిష్కరించిన వైనం ఇది. ఆ కాంతలోనే తన కాంతమ్మను దర్శించుకొన్న ఆదర్శం ఆయనది. అంతర్ముఖుడై ఆ చతుర్ముఖుడై వల్లె వేసిన వేదాల వంటివి ఈ స్మృతి రచనలు.

'ఐతరేయం' అంటే ఐతరుడనే ఋషి వెలువరించిన ఒక ఉపనిషత్తు, ఒక అరణ్యకం, ఒక బ్రాహ్మణం, భరద్వాజ 'ఐతరేయం' 'చిన్నీ', 'కన్నా'ల దాంపత్యోపనిషత్తు,

ఇది 'అతడు'–'ఆమె'ల అనురాగారణ్యకం,
'భరద్వాజ',–'కాంతమ్మ'ల బంధాల బ్రాహ్మణం. 'నా నృషిః కురుతే కావ్యమ్' –భరద్వాజ ఋషి నామధేయుడు. ఐతరేయుడూ ఋషే. అందుకే ఈ ఆర్యోక్తి సత్యోక్తి, సార్థకోక్తి!

ఇక్కడ కాంతమ్మ కేవలం ఒక సంకేతం మాత్రమే! కాంతమ్మ ప్రకృతి, భరద్వాజ పురుషుడు ప్రకృతి పురుషుల బంధం సృష్ట్యాది నుంచి జీవ చైతన్యానికి మూలాధారం. అయితే ఈ పురుషుడు స్త్రీని కేవలం తృతీయ పురుషార్థ దృష్టితో చూసేవాడు కాదు. శరీరంలో అర్ధభాగమిచ్చి ఆరాధించేవాడు. స్త్రీ మూర్తిలో తల్లిని, చెల్లిని, చెలిని, ఇల్లాలిని, బంధువును, దుహితను, దేవతను– ఇట్లా అనంత రూపాలను దర్శించి తరించినవాడు. అందుకే–

"నీలోని అమృతత్వం నిన్ను నాకు అమ్మను చేసింది
నీలోని వాత్సల్యం నిన్ను నాకు చెల్లిని చేసింది
నీలోని అమాయకత్వం నిన్ను నాకు బిడ్డను చేసింది
నీలోని సౌజన్యం నిన్ను నాకు మిత్రురాలిని చేసింది" (4.1.1988)

అంటాడు. స్త్రీ పురుషులిరువురూ చెరి సగంగా జీవించడమే అర్ధనారీశ్వర తత్త్వం. అదే జీవిత పరమార్థం.

భరద్వాజ కాంతమ్మ లౌకిక దృష్టి ఒక స్త్రీ, ఆదర్శ గృహిణి, ఉత్తమ ఇల్లాలు, పెద్ద ముత్తయిదువ, సగటు మనిషి, కానీ భరద్వాజ 'ఐతరేయం'లో కాంతమ్మ ఒక అనంత శక్తి స్వరూపిణి. ప్రకృతిలోని ప్రత్యణువులో నిండి నిబిడీకృతమై నిరంతరం ఆయన అంతరంగాన్ని ఆమె ఆలోచనలతోనే మథింపజేస్తూ, అన్వేషింపజేస్తూ అతని లోలోతుల్లోని బ్రాహ్మీమూర్తిని ఆవిష్కరింపజేసిన దివ్యశక్తి! ఆమె అతణ్ని భౌతికంగానే వదిలి వెళ్లింది. లౌకిక ప్రపంచంలో అదృశ్యమైనప్పటికీ ఆయన అలౌకిక ప్రపంచంలో ఆమె దృశ్యమానమవుతుంది. ఈశ్వరీయ తత్త్వాన్ని సందర్శింపజేస్తుంది.

"నీ అందాల కనులు నాకు ఆలయాల వంటివి...ఆ
నేత్రాలయాల్లోని ఈశ్వరుణ్ణి చూశాను. ఆ ఈశ్వర దర్శనం నన్నెంతగా మార్చిందో, నీకూ
నాకూ బాగా తెలుసు, ఈ లోకానికి కొంచెంగానే తెలుసు". (4.1.1988)

భావకవులు తమ తమ ఊహాసుందరీమణులను ఊతంగా చేసుకొని కైతలల్లితే, భరద్వాజ సహధర్మచారిణినే తన కావ్య జగతికి మహా సామ్రాజ్ఞిని చేసి, కులపాలికా ప్రణయానికి పట్టం కట్టారు.

"ఇవ్వాళ నువ్వెంత బాగున్నావని! విశ్వనాథ కిన్నెరసాని కవితలాగా, కృష్ణశాస్త్రి ప్రవాసం లాగా, నండూరి ఎంకిలాగా.. నాయుడు బావ పొంగిపోవడానికి నీవు నన్ను చూసినట్లు
గానే, ఎంకి కూడా నాయుడు బావను చూసి ఉండాలి" (3.1.1988)

భరద్వాజ చాలాచోట్ల భవభూతి 'ఉత్తర రామాచరితమ్'లోని అంశాలను తరచు పేర్కొంటూ ఉంటారు. సీతారాముల ఉదాత్త ప్రణయాన్ని తమకు అన్వయింపజేసుకొంటారు. అయితే తాను మాత్రం రాముణ్ణని ఎక్కడా చెప్పుకోకుండా కాంతమ్మకు మాత్రం సీతమ్మ పీట వేసి గౌరవిస్తారు.

"సీతమ్మ ఎడబాటుకే శ్రీరాముడు అలా సంక్షుభితుడైతే, కాంతమ్మను శాశ్వతంగా కోల్పోయిన నేను ఇంకేం కావాలి?" (30.7.1988)

అంటూనే తనను తాను సంభాళించుకొంటాడు.

"నేనెప్పుడన్నా గుర్తుకొచ్చానా కన్నా?" అన్నదామె.

"లేదు" అన్నాడతను.

"అదేం?" అత పాప ఏం చేశానయ్యా?" అన్నది ముఖం చిట్లించి.

"నిన్నసలు మరిచిపోయిందెప్పుడు, గుర్తు చేసుకోవడానికి?" అన్నాడతను కన్నీళ్లతో. (30.7.1988).

"నేనో వెర్రి మొక్కనయి, నీ సమాధి పక్కనే ఉంటే ఎంత బావుండును!" (27.10.1988)

అనుకొనే అల్ప సంతోషి. గొప్ప ప్రేమైకజీవి రావూరి భరద్వాజ.

1976లో, 1983లో రెండు సార్లు గుండెపోటుకు గురై, కళ్లముందే భార్యను కోల్పోయి, ఎదిగిన ఇద్దరు కొడుకులను పోగొట్టుకొని చివరి దశలో తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ మృత్యుముఖం దాకా వెళ్లారు.

తిరిగి 'జ్ఞానపీఠం' కోసమే అన్నట్టు మామూలు స్థితిలోకి వచ్చి మనలో తిరుగుతూనే 2013 ఏప్రిల్‌లో జ్ఞానపీఠ్ ప్రకటించాక ఢిల్లీ వెళ్లి జ్ఞానపీఠాన్ని అందుకొని, దానిని తెలుగు జాతికి అందించి, వారం రోజులు తిరగకుండానే అంటే 2013 అక్టోబర్ 18న తిరిగిరాని లోకాలకు తరలి వెళ్లిన మహా రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ.

గోపి: రవీ! గేటు బయటకొచ్చిన తరువాత కూడా బైక్ హారన్ ఎందుకు అన్ని సార్లు కొడతావు?

రవి: పక్క పోర్షన్ గిరిజ బయటకు రావాలని.

....

తల్లి: ఏంటమ్మా, సడన్‌గా వచ్చావ్?

కూతురు: నేను ఎక్కువగా సీరియల్స్ చూస్తున్నానని మీ అల్లుడు టీవీ అమ్మేసారు.

తల్లి: నేనూ అదే పని చేస్తున్నానని మీ నాన్న టీవీ అమ్మేసారు.

కూతురు: ఆ...

- వైదా ఈశ్వరరావు, విశాఖపట్నం

ధర్మం ప్రధానం

యామిజాల జగదీశ్



చతుర్విధ పురుషార్థాలలో మొదటిది ధర్మం. వేదాలన్నీ ధర్మానికి మూలం. ధర్మో రక్షతి రక్షితః.. ధర్మాన్ని మనం రక్షిస్తే మనలను ధర్మం రక్షిస్తుంది. కనుక ధర్మాన్ని గురించి స్థూలంగానైనా తెలుసుకోవాలి.

ధైర్యం, సహనం, దయ, దొంగతనం చేయకుండుట, శౌచం, ఇంద్రియ నిగ్రహం, బుద్ధి, విద్య, సత్యం, అక్రోధం.. ఈ పదీ ధర్మ లక్షణాలు. ధర్మాచరణం లేకపోవటం, అసుర స్వభావం కలవారు ధర్మ ప్రవృత్తిగానీ, అధర్మ నివృత్తిగానీ ఎరగరు. వారిలో శుచిత్వం, ఆచారం, సత్యంగానీ ఉండవు. కనుక ధర్మలక్షణాలను అలవరచుకుంటే అసురత్వం పోయి దైవత్వం కలిగి సుఖశాంతులతో జీవితం అలరారుతుంది. ఆధ్యాత్మిక జీవనం వికసిస్తుంది.

సనాతనమైన ధర్మమార్గమే క్షేమమని వేదమాత బోధ. సత్పురుషులు సంచరించిన ధర్మమార్గమే మనం అనుసరించవలసింది. శ్రీరాముడు వనవాసానికి వెళ్లినప్పుడు మహర్షులు వెళ్లిన మార్గమిది. దీనిగుండా ప్రయాణించు.. అని రుషులు చెప్పారు. విశ్వామిత్రుడు, భరద్వాజుడు, శరభంగుడు, అగస్త్యుడు.. ఇలా ప్రతీ మహర్షి రాముడికి రుషులు నడచిన మార్గాన్నే నిర్దేశించారు.

రాముడు ఆ విధంగానే ప్రయాణించి ధర్మ ప్రతిష్ఠాపన చేశాడు.

పెద్దలు ఆచరించి, మనకు అందించిన చక్కని మార్గమే సంప్రదాయం. ఇందులో పవిత్రత, దివ్యత్వం ఉన్నాయి. పూర్వీకులు అనుసరించిన దానిని తిరస్కరించినప్పుడు అదో సాహసమైన అనుభూతిగా ఉత్సుకతను కలిగించవచ్చు. దాని పరిణామంలో విషాదాన్నే మిగుల్చుతుంది. శీలం, సత్యం, ధర్మం, శౌచం వంటి సత్ప్రథాలు పాతవే అయినా భద్రమైనవి. సనాతనమైనది భారతీయత.

సత్యానికి, ధర్మానికి పెద్ద పీట వేసింది. 'సత్యం వధ, ధర్మం చర' అన్న వాక్యాలు భారత ప్రజల జీవన స్రవంతిలో శిరోధార్యమై వెలుగొందుతూ, తమ గొప్పతనాన్ని యుగయుగాలుగా చాటుతూనే ఉన్నాయి.

ధర్మాన్ని పాటించడం అత్యంత అవశ్యకమని ఎన్నో చక్కటి ఉదాహరణలతో తెలియజేస్తోంది మహాభారతం. ముఖ్యంగా మనం గుర్తుంచుకోదగిన పాత్రలు ధర్మరాజు, దుర్యోధనుడు. ధర్మ నిరతికీ, శ్రేయోగుణానికీ ప్రతీకగా ధర్మరాజు; దుష్ట ఆలోచనలకూ, దుర్నీతికీ ఉదాహరణగా దుర్యోధనుడు సాక్షాత్కరిస్తారు.

ధర్మమే సకల జగత్తుకూ ఆధారం అని తైత్తరీయారణ్యకం అంటుంది. అభ్యుదయాన్ని కలిగించేది ధర్మం అంటారు వైశేషికులు. వేదాల్లో చెప్పిన యాగాదులే ధర్మమంటారు మీమాంసకులు. చలనాన్ని నియంత్రణ చేసేది, గుణ సంబంధం లేనిది, రూపం లేనిది అజీవమయినదీ ధర్మమని రుషుల నిర్వచనం.

అసలు ధర్మమనే మాటే చిత్రమైనది. ఈ విశ్వాన్ని ధరించేది ధర్మం. ఏది సంఘాన్ని కట్టుబాట్లలో నిలుపుతుందో అదే ధర్మమని మహాభారతంలోని కర్ణపర్వంలో అంటాడు శ్రీకృష్ణుడు.

అతిపురాతనమయిన ధర్మసారాన్ని ఏ వ్యక్తో, ఏ ప్రవక్తో కనిపెట్టలేదు. అనేక అనుభవాల నుండి కాలం కనుగొన్న సంపూర్ణ మతమే ధర్మం. కాలక్రమంలో జన వ్యవహారంలో అనేక రూపాలు ధరించింది. వర్ణాశ్రమ ధర్మాలను ధర్మమన్నారు కొందరు.

వంశాచారాలూ ధర్మమే. లోకంలో మనం పాటించే ఆచార వ్యవహారాలనే ధర్మంగా పరిగణిస్తున్నారు. లోకనీతి కూడా ధర్మం కన్నా భిన్నం కాదు.

ఇలా స్థూల దృష్టికి విభిన్న అర్థాల్లో, రూపాల్లో గోచరిస్తున్నా సూక్ష్మ దృష్టితో చూస్తే ఇవన్నీ ఒకే పరమ ధర్మం తాలూకు రూపాలు. ధర్మం మనస్సును నియంత్రిస్తుంది. ఇతరులకు హాని కలిగించని రీతిలోనే కోరికలు అనుభవించాలని శాసిస్తుంది. ధనం సంపాదించమంటుంది మనస్సు. న్యాయమార్గంలోనే అదీ అవసరం మేరకే సంపదను ఆర్జించమంటుంది ధర్మం.

అంతేకాదు, సంపాదించిన దానిలో కొంత దానం చేయాలనీ చెబుతుంది.

నీతి కూడా ధర్మ స్వరూపమే. మనిషి పతనం కాకుండా ఉండేదుకు మన సంప్రదాయం నీతినియమాలను ఏర్పరచింది. వ్యక్తిగత నీతి, సామాజిక నీతి, వాణిజ్య నీతి, రాజనీతి, యుద్ధనీతి.. ఇలా మనిషి మనస్సును అడుగడుగునా నియంత్రించే నీతులున్నాయి. ధర్మంగా వ్యవహరించినప్పుడు ఈర్ష్య, కోపం, దురాశ మొదలైనవి మన మనసులో చేరవు.

నేటి కాలంలో శరవేగంతో జరుగుతున్న అనేక పరిణామాల హోరులో, ఈ ఉపదేశం ఒక దిక్సూచి. నూతనత్వపు ఒరవడిలో చాలా దూరం కొట్టుకువచ్చి, ఏం కోల్పోయామన్నది తెలుసుకొని, చాలామంది ఇప్పుడిప్పుడే నేత్రాలు తెరుచుకొని సనాతన ధార్మిక ప్రమాణాల వల్ల కలిగే ప్రశాంతత ఏమిటో గ్రహిస్తున్నారు. వారి అనుభవాలు మనకు గుణపాఠాలు కావాలి. ఒక వ్యామోహం మనల్ని లాగుతున్నప్పుడు, ఒక సనాతన ధర్మసూత్రం తన హెచ్చరికతో తన వైపు రమ్మని పిలుస్తుంది. ఆ సమయంలో, ఆ ధర్మ సూత్రాన్ని ఆధారంగా గ్రహించి నిగ్రహంతో నిలదొక్కుకున్నప్పుడు పూర్ణమైన జీవన మాధుర్యాన్ని ఆస్వాదించగలం.

(మిగతా 28వ పేజీలో..)

షేక్ అబ్దుల్ వాకీం జాని

ప్రసిద్ధ సముద్ర వంతెనలు

వాహనాలు నదులు, సముద్రాలు దాటాలంటే వంతెనలు అత్యవసరం. వంతెనలు దూరాన్ని తగ్గించడమే కాక ప్రయాణాన్ని సుఖప్రదం చేస్తాయి. వంతెనలు నిర్మించడమన్నది ప్రాచీన కాలం నుంచి ఉంది. మెసొపొటేమియా నాగరికత కాలంలోనూ వంతెనలు వాడారని ఆధారాలు ఉన్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అనేక సముద్ర వంతెనలు ఉన్నాయి. ఇవి మానవ మేధస్సుకు, చాతుర్యానికి, ఇంజినీరింగ్ ప్రతిభాపాటవాలకు నిదర్శనం.

చైనా-హాంకాంగ్ సముద్ర వారధి

చైనాలోని జుహై, హాంకాంగ్‌లోని మకావ్‌ల మధ్య నిర్మించిన సముద్రపు వంతెన ప్రపంచంలోనే అతి పెద్దదిగా ప్రసిద్ధి గాంచింది. అందుకే దీనికి హాంకాంగ్-జుహై-మకావ్ వంతెన అని నామకరణం చేశారు. ఈ వంతెన వలన చైనాలోని జుహై, హాంకాంగ్‌లోని మకావ్‌ల మధ్య ప్రయాణ సమయం నాలుగు గంటల నుండి 30 నిమిషాలకు తగ్గుతుంది.

చైనా రవాణాశాఖవారు అనుమతి లభించిన ప్రైవేటు వాహనాలు మాత్రమే దీనిపై ప్రయాణిస్తాయి. 120 యేళ్ల పాటు దీని సేవలు కొనసాగేలా పటిష్టంగా దీన్ని నిర్మించారు. 55 కి.మీ. పొడవైన ఈ వంతెన మార్గంలో 22.9 కి.మీ. వంతెన సముద్రంపై ఉండగా, 6.7 కి.మీ. పొడవున సొరంగ మార్గంలో ఉంది. రెండు కృత్రిమ ద్వీపాలను కలుపుతూ ఈ వంతెన నిర్మాణం కొనసాగింది. చైనా-హాంకాంగ్‌ల మధ్య అనుసంధానాన్ని ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ వంతెనను నిర్మించారు. ప్రపంచ నిర్మాణ రంగంలో ఇదొక అద్భుతమని చెప్పాలి.

పెద్ద పెద్ద నౌకలు వంతెనను దాటేందుకు సొరంగ మార్గాన్ని కూడా నిర్మించారు. ఇది వంతెన మీద వాహన రాకపోకలకు, సముద్రం మీద నౌకల రాకపోకలకు ఉపయోగపడుతుంది. భూకంపాలు, టైఫూన్లు మొదలైన ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడేలా సురక్షితంగా ఉండేలా దీన్ని నిర్మించారు. సముద్రం మీద ఇంత పెద్ద పొడవైన వంతెనను నిర్మించిన దేశంగా చైనా నిలిచింది.

హాంగ్జౌ బే బ్రిడ్జి

ఇది చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్‌లోని జియాక్సింగ్, నింగ్బో మున్సిపాలిటీల మధ్య ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 35.673 కి.మీ. ఉంటుంది. ప్రపంచంలో అతి పొడవైన బ్రిడ్జిగా ప్రసిద్ధి గాంచింది. దీని నిర్మాణానికి నాలుగు సంవత్సరాల కాలం పట్టింది. దీన్ని 2007లో ప్రారంభించారు. అయితే 2008 నుండి వాహనాల రాకపోకలను అనుమతించారు. ఆంగ్ల అక్షరం ఎస్ ఆకారంలో ఈ వంతెనను నిర్మించారు. 1.5 బిలియన్ డాలర్ల ఖర్చుతో దీన్ని నిర్మించారు.



డోంఘై వంతెన

ఇది ప్రపంచంలోనే అతి పొడవైన సముద్ర వంతెనలలో ఒకటి. ఈ వంతెన మెయిన్‌ల్యాండ్ షాంఘై పుడాంగ్ న్యూ ఏరియాను జెజియాంగ్ షెంగ్సీ కౌంటీలోని ఆఫ్‌షోర్ యాంగ్‌షాన్ డీప్-వాటర్ పోర్ట్‌తో కలుపుతుంది. సముద్రంపై నిర్మించిన ఈ వంతెన ద్వారా ఒక నగరం నుండి మరో నగరానికి చేరుకోవచ్చు. అందుకే ఈ వంతెనను ఈస్ట్ సీ గ్రాండ్ బ్రిడ్జి అని కూడా పిలుస్తారు. దీన్ని కూడా ఆంగ్ల అక్షరం ఎస్ ఆకారంలో నిర్మించారు. చైనాలో తొలిసారిగా సముద్రంపై నిర్మించిన వంతెనగా ప్రసిద్ధి గాంచింది ఈ వంతెన. దీనిని 2005లో ప్రారంభించారు. దీని పొడవు 32.5 కి.మీ. ఉంటుంది. 2008 సంవత్సరం వరకు ప్రపంచంలోనే సముద్రాన్ని దాటే అతిపెద్ద వంతెనగా ఇది పేరొందింది. ఆ తరువాత ఇంతకంటే అతి పెద్ద వంతెనలను అనేక దేశాలలో నిర్మించారు. ఈ వంతెన ద్వారా షాంఘై నగరానికి చేరుకోవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బిలియన్ డాలర్లను ఖర్చు చేశారు.

జియాజో బే బ్రిడ్జి

దీన్ని హైవాన్ వంతెన అని కూడా పిలుస్తారు. దీని పొడవు 42.6 కి.మీ. ఉంటుంది. ఇది చైనాలోని కింగ్‌డావో, హువాంగ్‌డావో జిల్లాల మధ్య ఉంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ వంతెనను ఆంగ్ల అక్షరం టి ఆకారంలో నిర్మించారు. ఈ వంతెన నిర్మాణానికి 4 లక్షల 50 వేల టన్నుల ఉక్కును, 2.3 మిలియన్ క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను ఉపయోగించారు.

కువైట్ సముద్ర వంతెన

కువైట్ రాజధాని నుండి సుబియాలోని భవిష్యత్ సిల్క్‌సిటీతో పాటు, దోహా నగరాన్ని అనుసంధానం చేస్తూ కువైట్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సముద్ర వంతెనను నిర్మించారు. కాజ్‌వే బే ఆఫ్ కువైట్ రెండు భాగాలుగా నిర్మించారు. ప్రధాన వంతెన పొడవు 36 కి.మీ. రెండవ వంతెనను కలుపుకుని 48.5 కి.మీ. ఉంటుంది. రోడ్డు మార్గం ద్వారా కువైట్, సబియా నగరాల మధ్య దూరం 104 కి.మీ. ఉంటుంది. సముద్రంపై నిర్మించిన ఈ వంతెన వల్ల ఆ దూరం 37 కి.మీ.కు తగ్గుతుంది. ఒకప్పుడు దోహా నగరానికి వెళ్లాలంటే 90 నిమిషాల సమయం పట్టేది. ఈ వంతెన నిర్మాణం వల్ల 30 నిమిషాలలో వెళ్లగలుగుతున్నారు. ప్రపంచంలో సముద్రంపై నిర్మించిన నాల్గవ అతి పెద్ద వంతెన ఇది. ఎక్కడ పడితే అక్కడ వాహనాలను ఆపడం, సెల్ఫీలు, ఫొటోలు దిగడం నిషిద్ధం.

గోల్డెన్ గేట్ వంతెన

ఆధునిక ప్రపంచ వింతల్లో ఒకటి శాన్‌ఫ్రాన్సిస్కోలో సముద్రంపై నిర్మించిన గోల్డెన్ గేట్ బ్రిడ్జి. దీన్ని గోల్డెన్ బ్రిడ్జి అని కూడా పిలుస్తారు. ఈ వంతెన మధ్య నుండి పారే సముద్ర జలాలను గోల్డెన్ గేట్ అంటారు. అందుకే దీనికి గోల్డెన్ గేట్ బ్రిడ్జి అనే పేరు వచ్చింది. అతి బలమైన తాడులాంటి ఇనుప తీగల ఆధారంగా ఈ వంతెన వేలాడుతుంటుంది. అందుకే దీన్ని వేలాడే వంతెన అని కూడా పిలుస్తారు. ప్రపంచంలోనే అతి పొడవైన వేలాడే వంతెనగా ఖ్యాతినార్జించింది. ఆ తరువాత ఇటువంటి నిర్మాణాలు ప్రపంచంలో ఎన్నో జరగడంతో ఈ వంతెన ప్రపంచంలో 18వ పొడవైన వంతెనగా స్థానం పొందింది. ఇది 2,737.1 మీటర్ల పొడవు ఉంటుంది. కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగర ప్రవేశ ద్వారాన్ని మెరిన్ కౌంటీ నగరాన్ని కలుపుతుంది. చరిత్రలో అత్యధికంగా ఫొటోలు దిగిన బ్రిడ్జిగా ఇది నమోదైంది. ఆధునిక ప్రపంచంలోని అద్భుతాలలో ఒకటిగా దీనికి గుర్తింపు లభించింది. ఈ వంతెన శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియా నగరాలలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన చిహ్నాలలో ఒకటి. దీనిపై రోజుకు దాదాపు లక్షకార్లు, ప్రతి యేడాది సుమారు నలభై మిలియన్ల వాహనాలు గోల్డెన్ వంతెనపై ప్రయాణిస్తాయని అంచనా. గోల్డెన్ గేట్ వంతెనపై నిర్మించిన ఫుట్‌పాత్‌లపై నడుచుకుంటూ, సైకిళ్లపై వెళ్లవచ్చు. ఈ ప్రదేశంలో భూకంపాలు వస్తుంటాయి. 1989లో ఒకసారి భూకంపం వచ్చింది. స్వల్ప నష్టం వాటిల్లినప్పటికీ నిలబడి తట్టుకుంది. ఈ ప్రాంతంలో పొగమంచు లాంటి వాతావరణం ఎక్కువ కాలం ఉంటుంది. వాతావరణం పొడిగా ఉన్నప్పుడు మాత్రమే పూర్తి వంతెనను స్పష్టంగా చూడగలం.

భారతదేశంలో పొడవైన వంతెన

మన దేశంలో అరేబియా మహా సముద్రంపై అత్యంత పొడవైన వంతెనను ముంబైలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ఇది ఇంజినీరింగ్ అద్భుతంగా చెప్పవచ్చు. దీనిని అటల్ బిహారీ వాజ్‌పేయ్ పేరుతో అటల్ సేతు పిలిచే ఈ వంతెన పూర్తి పేరు వాజ్‌పేయి సేవరి-నవశివ అటల్ సేతు. అటల్ సేతు బ్రిడ్జిని ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్ అని కూడా పిలుస్తారు. 21.8 కి.మీ. పొడవున్న ఈ వంతెనను 16.5 కి.మీ. సముద్రం మీద, 5.5 కి.మీ. భూమిపై నిర్మించారు. ఈ వంతెన కారణంగా ముంబై, నవీ ముంబైల మధ్య ప్రయాణ దూరం రెండు గంటల నుంచి 20 నిమిషాలకు తగ్గుతుంది. ఈ వంతెన ముంబైలోని అంతర్జాతీయ విమానాశ్రయం, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయాలను అనుసంధానిస్తుంది. ఆర్థికాభివృద్ధికి ఈ వంతెన దోహదపడుతుంది. మహారాష్ట్రలోని రెండు పెద్ద నగరాలతో పాటు ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్ వే, ముంబై-గోవా హైవేలను కూడా కలుపుతుంది.

ముంబై నుండి పూణే, గోవాతో పాటు దక్షిణ భారతదేశానికి ప్రయాణ సమయాన్ని సైతం తగ్గిస్తుంది. ఈ వంతెన నిర్మాణంలో ఈఫిల్ టవర్‌లో వాడినదానికన్నా పదిహేడు రెట్లు ఎక్కువ ఇనుమును వినియోగించారు. స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహానికి ఉపయోగించిన కాంక్రీట్ కంటే ఆరు రెట్లు అధికంగా వాడారు. దీని కారణంగా ముంబై పోర్ట్-జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ మధ్య కనెక్టివిటీ మెరుగు పడుతుంది. అటల్ వంతెనపై పటిష్ట భద్రతను ఏర్పరిచారు. ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్‌గా ప్రసిద్ధి చెందిన ఈ వంతెనపై నిత్యం రోజూ 70 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

శీతాకాలంలో ఇక్కడికి వలస వచ్చే ఫ్లెమింగో పక్షులను దృష్టిలో ఉంచుకుని వంతెనపై సౌండ్ బారియర్ ఏర్పాటు చేశారు. సముద్రపు జీవులకు హాని కలిగించని లైట్లను డిజైన్ చేసి వంతెనపై అమర్చారు. అటల్ సేతు నిర్మాణంలో పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అటల్ సేతుపై ఏదైనా వాహనం ఆగిపోయినా, పాడైనా, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా ఆ సీసీటీవీ కెమెరాలు సమాచారాన్ని వెంటనే కంట్రోల్ రూమ్‌కి అందిస్తాయి. వెంటనే పోలీసులు అప్రమత్తమై తగిన చర్యలు తీసుకుంటారు.

సింగిల్ పేజీ కథ

తాళ్ళూరి లక్ష్మి

అ(హో)మెరికా

“అమ్మయ్య! ఈ రోజుతో రెండోవాడు కూడా అమెరికాలో సెటిలైపోయాడు” చిన్నబ్బాయి పంపించిన సందేశం చూసి మురిసిపోతూ భార్య యశోదతో అన్నాడు శివరావు.

అతని మాటలకు పక్కనే ఉన్న బావమరిది “ఇద్దరిలో ఒక్కరైనా ఇక్కడ ఉంటే బావుండేదేమో బావగారూ. రిటైర్ అయ్యాక మీకు ఆసరాగా వుండేవాడు” అన్నాడు.

అతని మాటలు కొట్టిపారేస్తూ శివరావు “రిటైర్ అవగానే మేం కూడా ఆ భూతల స్వర్గానికి చెక్కేస్తాంలేరా రఘు. మా గురించి దిగులు పడకు” అన్నాడు.

కాలచక్రంలో పదేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. శివరావు డెబ్బై సమీపిస్తున్నాడు. ఇంకా గ్రీన్ కార్డు లభించకపోవడంతో అమెరికాకు వెళ్ళి స్థిరపడడం కుదరలేదు.

మధ్యలో భార్యాభర్తలిద్దరూ విజిటర్స్ వీసా మీద రెండుసార్లు వెళ్లి రెండేసి నెలలు ఉండి వచ్చారు కోడళ్ల డెలివరీ సమయంలో. రెండుసార్లు ఇంటికి, ఆసుపత్రులకే పరిమితం కావాల్సి వచ్చింది.

ఎప్పుడెప్పుడా.. అని ఎదురు చూస్తున్న గ్రీన్‌కార్డు రావడంతో శివరావు ఎగిరి గంతేసి ఇల్లు, కారు, ఫర్నిచర్ అన్నీ అమ్మకానికి పెట్టాడు.

బావమరిది రఘు “అదేమిటి బావగారూ, తిరిగి ఇక్కడికి రారా అంటే–

“ఇక్కడ ఏముందని తిరిగి రావాలిరా? వెళ్తున్నది ఎక్కడికి... అమెరికాకి!” అన్నాడు.

అన్నట్టే సమస్తం అమ్మేసి అమెరికాకి వెళ్లిపోయాడు భార్యతో సహా. కాలగమనంలో మరో ఏడాది గడిచిపోయింది. ఒకరోజు రఘుకి శివరావు నుంచి మెసేజ్ వచ్చింది మరుసటిరోజు వస్తున్నట్టు, ఎయిర్ పోర్ట్‌కి రమ్మని.

మర్నాడు రఘు ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి అక్క, బావగార్లను ఇంటికి తీసుకువచ్చాడు.

కాలకృత్యాలన్నీ అయ్యాక టిఫిన్ చేస్తుండగా చెప్పాడు శివరావు “ఇక్కడే శాశ్వతంగా ఉండిపోదామని వచ్చాంరా రఘూ! మేం అన్నీ అమర్చుకునేదాకా కొద్ది రోజులు నీ దగ్గరే ఉంటాం” అన్నాడు.

అందుకు రఘు “దానికేముంది బావగారూ, అయినా మీరెందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు?” అనడిగాడు.

దానికి శివరావు “వయసులో వున్నప్పుడు కొద్ది రోజులు వెళ్లి చూసిరావడానికి అమెరికా బాగుంటుంది. కానీ వృద్ధాప్యంలో వెళ్లి శాశ్వతంగా ఉండాలనుకోవడం ఒక శాపమేరా.

కొడుకులు, కోడళ్లు, మనవలు, మనవరాళ్లు అందరూ ఎవరి పనులలో వారు ఉరుకులు పరుగులు తీస్తూ ఉంటారు. మనం మాట్లాడుకోవడానికి మరో ప్రాణి లేకుండా ఒంటరిగా రోజంతా గడపడం నరకంరా. ఇక్కడ ఇంటి బయటికి వస్తే పలకరించడానికి ఇరుగు–పొరుగు బోలెడంత మంది. అ అక్కడ బిక్కు బిక్కుమంటూ నాలుగు గోడల మధ్య మేమిద్దరమే. ఇక వైద్యం ఖర్చులైతే ఆకాశన్నంటుతాయి. ఇలా ఇంటి తలుపులు బార్లా తెరుచుకుని గాలీ, వెలుతురు పుష్కలంగా లభిస్తుంటే హాయిగా కబుర్లు చెప్పుకుంటూ గడిపి ఎన్ని రోజులయిందిరా...! అంటూ తన ఆనందం వ్యక్తపరిచాడు శివరావు.

(25వ పేజీ తరువాయి...)

ధర్మం ప్రధానం

అర్థ, కామ, సాధనలోని వేగాన్ని నియంత్రించేది ధర్మమే. అది నాతన సత్పథం. సమాజ క్షేమానికి అదొక్కటే శరణ్యం. విలువలను బోధించి, జీవితాల్లోకి అందించినప్పుడే ప్రస్తుతం అలుముకున్న అనిశ్చిత అవ్యవస్థను పరిష్కరించగలం.

మనల్ని పెద్దవారు ‘రామా! కృష్ణా! అని అనుకోమన్నారని అంటే ఒక మూల కూర్చుని రామా, కృష్ణా అని భజన చేసుకోమని కాదు అర్థం. రాముణ్ణి, కృష్ణుణ్ణి అధ్యయనం చేసి, జీవితాలకు అనుసంధానం చేసుకొని జీవంచమని భావం. అందుకోసమే వాల్మీకి, వ్యాసుడు మన ముందు రాముడిని, కృష్ణుడిని వుంచారు. వారి ఆధారంగా ధర్మాన్ని అర్థం చేసుకొని, జీవితాలను మలచుకోవడమనేది పెద్దల ఉద్దేశం.

శ్రీరాముడు సనాతన ధర్మాన్ని ప్రతిష్ఠించిన పుణ్యమూర్తి. ధర్మార్థ కామ మోక్షాల విషయంలో ఇందులో ఉన్నదే ఎక్కడైనా ఉంది. దీనిలో లేనిది మరెక్కడా లేదు అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు.

సమస్త విజ్ఞానమూ వేదంలో ఇమిడి వున్నట్లుగానే మహాభారత ఇతిహాసంలోను ఇమిడి ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఎప్పుడు ధర్మానికిగ్గాని హాని కలిగినా దాని పర్యవసానంగా అధర్మం పెచ్చు పెరుగుతుంది. దాన్ని తటస్థీకరించడానికి దైవ ప్రకృతి ప్రయత్నిస్తుంది. ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఇలా చెప్పాడు... “ధర్మానికి హాని కలిగి, అధర్మం విజృంభించినప్పుడు, ధర్మాన్ని స్థిరంగా ప్రతిష్ఠించటానికి తాను అవతరిస్తానని” పురుషోత్తముడు ప్రకటించాడు. ధర్మం వల్లనే అర్థం లభిస్తుంది. ధర్మం వల్లనే కోరికలు నెరవేరుతాయి. ధర్మం వల్లనే ఉత్తమ గతులు లభిస్తాయి. ఆ కారణం చేతనే అన్ని విధాలా ధర్మాన్నే ఆశ్రయించాలి. అర్థ, కామ, మోక్షాలు, ధర్మం అనే పునాదిపైన ఆధారపడి ఉన్నాయి కనుక ప్రథమమూ, ప్రధానమూ ధర్మమే.

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

తులసికోట ఏ దిక్కులో ఉండాలి?

తులసిమొక్క హిందువులకు గోమాతలా అతి పవిత్రమైనది, పూజనీయమైనది. తులసి ఆకులను చాలా ఔషధాల్లో ఉపయోగిస్తారు. ఎన్నో రోగాలకు దివ్యమైన ఔషధంగా ఉపయోగపడే తులసిమొక్క విశేషాలు:

చెట్లు రోజంతా బొగ్గుపులుసు వాయువును గ్రహించి ప్రాణవాయువులను విడుదల చేస్తాయి. రాత్రుళ్లు ప్రాణవాయువును గ్రహించి బొగ్గుపులుసు వాయువును విడుదల చేస్తాయి. రాత్రుళ్లు భారీగా బొగ్గుపులుసు వాయువుని విడుదల చేసే వృక్షాల్లో చింతచెట్టు ఒకటి. ఇలాంటి చెట్ల కింద రాత్రుళ్లు పడుకుంటే అది విడుదల చేసే బొగ్గుపులుసు వాయువు ఎక్కువగా కలిసివున్న వాయువును మనం శ్వాసించాల్సి వస్తుంది. తద్వారా మెదడుపై ప్రభావం పడి చెడు కలలు రావడం, నిద్రలో దడుచుకోవడం జరుగుతుంది. అందుకే రాత్రిపూట చింతచెట్ల కింద పడుకోవద్దని మన పెద్దవాళ్లు చెప్తుంటారు.

తులసిచెట్లు రాత్రిపూట కూడా ప్రాణవాయువునే వెదజల్లుతుంటాయి. మనిషి ఆరోగ్యానికి చేయూతనిచ్చే ఇలాంటి మొక్కలు ఇంటి ఆవరణలో వుండటం ఎంత అవసరమో వేరే చెప్పనవసరం లేదు. సైంటిఫిక్‌గా ఈ కారణాలు చెప్పకుండా ప్రతి ఇంటిలో తులసిమొక్క వుండాలని 'తులసి లేని ఇల్లు గుల్ల చేస్తుంది ఒళ్లు' లాంటి సామెతలను పెద్దవాళ్లు చెప్తుంటారు. ఎలా చెప్పినా ప్రతి ఇంట్లో కనీసం ఒక తులసి మొక్క పెంచటం సర్వదా శ్రేయస్కరం.

మొక్కల మీద రీసెర్చ్ చేసి వాటికి ప్రాణముందని, స్పందన వుందని నిరూపించిన నోబుల్ బహుమతి పొందిన జగదీశ్ చంద్రబోస్‌ని స్మరించుకోవడం సందర్భోచితంగా ఉంటుంది. చెట్టులో ఒక భాగానికి నిప్పుతో చురక అంటిస్తే అదే చెట్టులోని మిగతా భాగాలు స్పందించి ముడుచుకుపోవడం అతడు చేసిన ప్రయోగాల్లో ఒకటి. ఎండ వేడెక్కువ లేనప్పుడు చిరుగాలికి ఆహ్లాదంగా కదిలే పూలమొక్కల స్పందన మనకు కొత్త కాదు. మొదటిసారి మొగ్గవేసిన పూలమొక్కను క్షణం పరిశీలనగా చూస్తే ఆ మొక్క ఏదో సాధించిన పనివాడిలా మురిసిపోవడం కనిపిస్తుంది. అయితే అవన్నీ చూసే తీరిక లేక వాటి ప్రకంపనాలు అధ్యయనం చేసే మహద్భాగ్యాన్ని మనం పోగొట్టుకుంటున్నాం.

తులసి నుండి వచ్చే ప్రాణవాయువు ఇంటి ఆవరణలోని గాలిలోని కాలుష్యాన్ని తగ్గించటానికి తోడ్పడుతుంది. కలుషితం తక్కువ వుండే వాయువులను శ్వాసించడం వలన మెదడుపైన కాలుష్య ప్రభావం తక్కువగా పడుతుంది. తద్వారా ఆలోచనా సరళి ఎక్కువ ఆరోగ్యపూరితంగా వుంటుంది. 'డెసిషన్ మేకింగ్' అంటే తమ తమ సమస్యల మీద తీసుకొనే నిర్ణయాలు ప్రగతి పథంవైపు నడిపించేవిగా వుంటాయి. పెద్ద పెద్ద కాన్ఫరెన్సు హాళ్లలో ఎగ్జిక్యూటివ్‌లు కూర్చుని సంస్థలు నడిపించే గదుల్లో తులసిమొక్కలు లేకపోయినా పూలమొక్కలు వుండటానికి ఇదొక శాస్త్రీయ కారణం. ఆహ్లాదంగా ఎదురుగా కుండీల్లో పూలమొక్కలు కనిపిస్తుంటే అందంగా కనిపించటమే కాకుండా అవి విడుదల చేసే ఆక్సిజన్ వలన టెన్షన్ తగ్గి మనసు నెమ్మది పొందుతుందనడంలో అతిశయోక్తి లేదు.

తులసి ప్రకంపనాలు ఇంట్లోని వ్యక్తుల మీద చక్కటి ప్రభావం చూపిస్తాయి. ప్రయత్నం చేస్తే ఇంట్లో పిల్లలతో, తల్లితో మాట్లాడినట్టు తులసితో సంభాషించవచ్చంటే ఆశ్చర్యం వేస్తుంది. 'తన్మూలే సర్వ తీర్థానీ తన్మధ్యే సర్వ దేవతాః తదగ్రే సర్వ వేదశ్చ తులసిత్వాం నమామ్యం' అని చదువుతూ తులసికి ప్రతి ఉదయం నీళ్లు పోసి నమస్కరించాలి.

పవిత్రమైన స్థలాన్ని శుచిగా శుభ్రంగా వుంచితే మంచి ఫలితాలు వచ్చినట్లు అపరిశుభ్రంగా వుంచితే చెడు ఫలితాలు వస్తాయి. అలాగే తులసి విషయంలోనూ జరుగుతుంది. రోజూ ఓ చెంబు నీళ్లు పోసి నమస్కరిస్తే చాలు. కానీ అపరిశుభ్రంగా వున్నవాళ్లు అటూ ఇటూ నడుస్తున్నప్పుడు తులసిని తాకటం జరిగితే తులసి ఆగ్రహిస్తుంది. కనుక ఈ చిన్న విషయంలో కాస్త జాగ్రత్త పడాలి.

తులసిని ఇంటి ఆవరణలో ఎక్కడ పెట్టటానికి అనువైన స్థలం వుందో ముందు నిర్ణయించుకోవాలి. అంటే దారిలో కాకుండా వుండేలా చూసుకోవాలి. నిర్ణయించుకున్న స్థలం ఉత్తరం అయితే అక్కడ తులసికోటను ఏర్పాటు చేయకూడదు. ఉత్తరపు పల్లంలో తులసిని కుండీలో అమర్చుకోవడం ఉత్తమం.

దక్షిణ భాగంలో తులసికోటను నిర్మించుకోవడం మంచిది. దక్షిణంలో ఎత్తయిన భాగంలో తులసికోట నిర్మాణం మరీ మంచిది. అలాగే నైరుతిలో కూడా ఎత్తయిన భాగంలో తులసికోట శుభప్రదమైంది. పడమరలో కూడా ఉన్నత స్థానంలో తులసికోట శ్రేష్టమైనది. ఈశాన్య భాగంలో తులసికోట మంచి ఫలితాలనివ్వదు. ఈశాన్య పల్లంలో కుండీలో పెట్టుకోవచ్చు. కానీ దక్షిణ, నైరుతి, పడమర ఉన్నత స్థానాల్లోనే మంచి ఫలితాలు కలగడం గమనించవచ్చు.

తూర్పు ముఖ ద్వార గృహంలో తూర్పు ఆగ్నేయంలో తులసికోట నిర్మించాలి. తులసిచెట్టు స్థానాలు కలిగించే మంచీ, చెడు ఫలితాలు ఎక్కువగా స్త్రీల మీద మాత్రమే చూపిస్తాయనే నమ్మకం ఒకటుంది. అది సరైంది కాదు. ఇంట్లో వున్న అందరి మీద ఫలితాలు వుంటాయి.

వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

మేషం

ప్రతి విషయంలోనూ అన్ని విధాలా జాగ్రత్తలు పాటించండి. ఆరోగ్య సమస్యలుంటాయి. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల అప్రమత్తంగా ఉండండి. దూర ప్రాంత ప్రయాణాలు చెప్పదగినవి కాదు. వృత్తి, ఉద్యోగాల్లో సానుకూల ఫలితాలు సాధిస్తారు. వ్యాపారస్తులు మెలకువతో వ్యవహరించాలి. పెట్టుబడుల విషయంలో నిష్ణాతుల సలహాలు తీసుకోండి.

వృషభం

కొత్త పరిచయాల ద్వారా పాత సమస్యలు కొత్త కోణంలో తారసపడతాయి. మీ సహనానికి పరీక్షలు ఎదురవుతాయి. ఆర్థిక స్థితిలో ఇబ్బందులేమీ ఏర్పడవు. ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. ప్రజా సంబంధాలను మరింత వృద్ధి చేసుకోవడానికి నూతన ప్రక్రియలు అవలంభిస్తారు. కుటుంబ సభ్యుల పేరుతో నూతన బ్యాంక్ అకౌంట్లు ప్రారంభిస్తారు.

మిథునం

దైవ సంబంధిత, సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కారణం లేని చికాకుల వల్ల ప్రశాంతత కోల్పోతారు. శుభప్రదమైన కార్యక్రమాలు ప్రయాస మీద నెరవేరతాయి. సమయోచితంగా వ్యవహరించి మీకు రావలసిన సొమ్ము రాబట్టుకుంటారు. చెల్లింపులను కూడా సకాలంలో చెల్లిస్తారు. మాట మీద నిలబడే వ్యక్తిగా పేరు సంపాదిస్తారు.

కర్కాటం

విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబ బాధ్యతలు నెరవేర్చడంలో క్రమబద్ధమైన ప్రణాళికలు రూపొందించుకుంటారు. వాయిదా పడుతున్న వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయడం మంచిది, నరదృష్టి తొలగిపోతుంది. వాక్చాతుర్యంతో కీలక వ్యవహారాలను చక్కబెట్టుకుంటారు.

సింహం

వాహన మరమ్మత్తులు చేస్తారు. విశాల హృదయంతో వ్యవహరిస్తారు. అందరి పట్ల సమ న్యాయం కనబరుస్తారు. మంచి వ్యక్తిగా గుర్తింపు పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు కలిసి వస్తాయి. రాజకీయ రంగంలోని వారికి అనుకూలం. జీవిత భాగస్వామితో కీలక విషయాలపై చర్చలు సాగిస్తారు. సెంటిమెంట్ వస్తువుల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించండి.

కన్య

క్రీడాకారులు మంచి ఫలితాలు సాధిస్తారు. దీక్ష కార్యక్రమాలు చేపడతారు. వ్యాపార పరంగా మీరు తీసుకునే నిర్ణయాలు ఫలిస్తాయి. మిత్రుల సలహాలు పాటిస్తారు. పెద్దల పేరు మీద స్వయంపాకం ఇవ్వండి. మీ అభిప్రాయాలతో పెద్దలు కూడా ఏకీభవిస్తారు. అవకాశాలు కలిసి వస్తాయి. సంతాన విషయంలో శ్రద్ధ కనబరుస్తారు. కళల పట్ల మక్కువ పెరుగుతుంది.

తుల

సొంత నిర్ణయాలు తీసుకుంటారు. దారీ, తెన్నూ లేని వ్యవహారాలను ఒక గాడిలో పెట్టడానికి మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. సెంటిమెంట్ విషయాలు కలిసి వస్తాయి. వాహన యోగం. నిత్యావసర ధరలు, ఖర్చులు ఆలోచింప చేస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. పక్షులకు దాన వేయడం మంచిది. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటిస్తారు. వినోద కార్యక్రమాలు, విలాసాలకు ఎక్కువ ప్రాముఖ్యమిస్తారు.

వృశ్చికం

నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండగలుగుతారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. పక్షులకి నీళ్ల పెట్టండి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి అర్చన జరిపించండి. శుభవార్తలు వింటారు. సలహాలు, సూచనలు ఇచ్చేవారు అధికంగా వుంటారు. నిష్కారణంగా నిందారోపణలకు గురి చేస్తున్నవారిని గుర్తిస్తారు.

ధనుస్సు

స్వార్థ ప్రపంచాన్ని చూసి నివ్వెరపోతారు. పార్ట్ టైం ఉద్యోగం సంపాదిస్తారు. ఆశించిన రుణాలు సకాలంలో అందుకుంటారు. ప్రతి విషయాన్నీ స్ఫూర్తిగా తీసుకుంటారు. పక్షులకు దాన వేయడం మంచిది. రచనా వ్యాసంగాలను సాగిస్తారు. గృహాలంకరణకు ప్రాముఖ్యం ఇస్తారు. ఉపయుక్తమైన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. సుమంగళి పసుపుతో అష్టోత్తరం చదువుతూ గౌరీదేవిని అర్చించడం శుభదాయకం.

మకరం

ఆరోగ్యం నలతగా ఉంటుంది. వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. శ్రేయోభిలాషులతో కలిసి చర్చలు సాగిస్తారు. ఆహార నియమాలను పాటించడం చెప్పదగిన సూచన. ప్రయాణాలు లాభిస్తాయి. ఆర్థికస్థితి మెరుగ్గా ఉంటుంది. ప్రజా సంబంధాలను మరింత వృద్ధి చేసుకుంటారు. పక్షులకి దాన వేయండి. అనాలోచిత నిర్ణయాలను తీసుకుంటారు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

కుంభం

చెల్లింపుల విషయం గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. ఉత్తమమని భావించిన వ్యవహారాలలో ఇతరులకు జోక్యం కల్పించకండి. పక్షులకి నీళ్ల పెట్టండి. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. సోదరులను, మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వాహన సౌఖ్యం పొందుతారు. నూతన స్వగృహం కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తారు.

మీనం

ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. దూర ప్రాంతాల నుంచి శుభ వార్తలు వింటారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరం చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. జీవిత భాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు.

ఈ వారం కా'ర్ట్యూన్స్'


బాగా చెప్పలేదని మీరు సగం.. బాగా చదవలేదని
నేను సగం ఒప్పుకుందాం..డీల్...??


ఈయనకు జాలి, దయ, మానవత్వం ఏమీ
లేవట సార్.. మనకు HR గా పనికొస్తాడని...
- CHAIRMAN -


ఏంటీ.. పక్కింటి మొగుడూ పెళ్ళాలు పోట్లాడుకుంటున్నారా? ఒకసారి
వెళ్ళి చూసి రావాలా? అలా ఒకసారి వెళ్ళి వచ్చినందుకే ఈ పోట్లాట..!!

ఫోటో ఫీచర్

క్యూవాస్ డే మార్మోల్‌గా పిలవబడే ఈ గుహాలు చిలీలో ఉన్నాయి. క్యూవాస్ డే మార్మోల్ అంటే చలువరాతి గుహాలు. జనరల్ కార్రిరా సరస్సు మధ్యలో ద్వీపకల్పంలా ఉంటాయియీ గుహాలు. ఇక్కడి నీటిలో ఉన్న కాల్షియం కార్బోనేట్ వల్ల నీళ్లతో పాటు మార్బుల్ రంగు కూడా నీలంగా ఉంటుంది.